ప్రభాత సూర్య
www.suryaa.news
తెలుగు జాతీయ దిన పత్రిక
వేల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 18 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 42

## నార్త్ రింగరోడ్డుకు మహర్ధశ

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరంతో ఈ ప్రాజెక్టుని నిర్మిస్తున్నారు. అయితే ఉత్తర భాగం పనుల టెండర్లపై ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది. బిడ్లు సమర్పించడానికి జూన్ 18 వరకు మాత్రమే గడువు ఉండగా.. 19న టెండర్లను తెరవాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబరు 27న భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల కోసం ఐదు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# గో సంరక్షణకు సమగ్ర విధానం

- గోవుల సంరక్షణపై సమగ్ర విధానం రూపొందిస్తాం
- ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ నియామకం
- ముందుగా వేములవాడ, యాదగిరి గుట్ట, ఎనికేపల్లి,
- పశుసంవర్ధక శాఖ వర్సిటీ సమీపంలో పెద్ద గోశాలలు
- వేములవాడలో 100 ఎకరాలకు తగ్గకుండా నిర్మాణం
- గోసంరక్షణపై అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్



సూర్య న్యూస్ హైదరాబాద్

తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ కమిటీలో ఉన్నారు. గో సంరక్షణపై రేవంత్ రెడ్డి మంగళవారం - మిగతా2లో




# విమానాలతో వణుకు

- వెలుగుచూస్తున్న సాంకేతిక సమస్యలు
- శాన్‌ఫ్రాన్సిస్కో-ముంబయి సర్వీసు కోల్‌కతాలో దించివేత
- నాగ్‌పుర్‌లో ఇండిగో ఎమర్జెన్సీ ల్యాండింగ్
- ఎయిరిండియా అంతర్జాతీయ విమానాల్లో ఏడు రద్దు
- ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో కోల్‌కతా విమానాశ్రయంలో అత్యవసరంగా దిగిన ఎయిరిండియా విమానం

## కెనడాలో మోదీపై దాడికి ఖలిస్థానీల కుట్ర



- జీ7 సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం కెనడాకు మోదీ
- రాష్ట్రంలోని కల్గరీ నగరంలో నిరసన తెలిపేందుకు ఖలిస్థానీ వేర్పాటువాదులు
- 'మోదీ రాజకీయాలను చంపేయండి(కిల్ మోదీ పాలిటిక్స్)' అంటూ కెనడా ప్రధాని మార్క్ కార్నీకి నిరసనకారులు పిలుపు



## తక్షణమే ఖాళీ చేయండి

- టెహ్రాన్ ప్రజలకు ట్రంప్ సూచన
- జీ7 సదస్సు నుంచి స్వదేశానికి
- కెనడాలో జరగాల్సిన కీలక భేటీలు రద్దు
- ఇజ్రాయెల్ దాడులు భీకరంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి



## బరాజ్‌లపై నిర్ణయం కేసీఆర్‌దే

- మంత్రివర్గ సమావేశాల్లో ఎలాంటి నిర్ణయం జరగలేదు
- జస్టిస్ ఘోష్ కమిషన్‌కు తెలిపిన నీటిపారుదల శాఖ
- కేసీఆర్ వాంగ్మూలాన్ని తోసిపుచ్చిన ప్రభుత్వం

సూర్య న్యూస్ హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఎదుట బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. గత ప్రభు త్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో బరాజ్‌ల నిర్మాణంపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేసింది. - మిగతా2లో

## వాంగ్మూలాల రూపంలో సాక్ష్యాలు

- ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ ముందుకు బాధితులు
- 618 మంది జాబితాలో కాంగ్రెస్, భాజపా అగ్రనేతలు
- ఆ పార్టీల కార్యాలయాల్లోని ఉద్యోగులు సైతం..
- ఈటలకూ పిలుపు.. 22న వస్తానన్న ఎంపీ





## ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు


- హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్ రీజియన్ల పరిధిలో నియామకానికి త్వరలో నోటిఫికేషన్
- రెండు నెలల క్రితం 1,000 మంది డ్రైవర్లు, ఇప్పుడు 800 మంది కండక్టర్ల రిక్రూట్‌మెంట్

# బాంబుల వర్షం

- ఇరాన్‌పై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్
- ఖమేనీ సన్నిహిత సలహాదారు మృతి
- టెహ్రాన్‌లో భయానక పరిస్థితులు
- నగరాన్ని వీడుతున్న జనం
- జీ7 నుంచి అర్ధంతరంగా వచ్చేసిన ట్రంప్
- కాల్పుల విరమణ కంటే మెరుగైన పరిష్కారం కోసం చూస్తున్నాం.. ఖమేనీ ఎక్కడున్నారో తెలుసని వ్యాఖ్య
- ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు
- మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ దాడి

ఉద్రిక్తతల తగ్గింపునకు ఐరోపా, అరబ్ దేశాల పిలుపు

- సరిహద్దులు దాటి ఆర్మేనియా చేరుకున్న భారత విద్యార్థులు



సూర్య న్యూస్ వాషింగ్టన్

ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమైంది. ఇరు దేశాల దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. యుద్ధ విమానాలతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. అటు ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపిస్తోంది. ఐదో రోజైన మంగళవారం పరస్పరం జరుపుకొన్న దాడుల్లో రెండు వైపులా భారీ నష్టం సంభవించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సన్నిహిత సలహాదారు మరణించారు. ఇజ్రాయెల్‌లోని మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై దాడిచేసిన ఇరాన్.. డ్రోన్ల తయారీ యూనిట్‌ను ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్‌లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు నగరాన్ని వీడుతున్నారు. ఇక జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడా వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అర్ధంతరంగా వాషింగ్టన్ వచ్చేశారు. కాల్పుల విరమణ కంటే మెరుగైన పరిష్కారం కోసం చూస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. దీనిని బట్టి ఏదో జరగబోతోందని అర్థమవుతోందని పరిశీలకులు అంటున్నారు. మరోవైపు ఉద్రిక్తతల తగ్గింపునకు ఐరోపా, అరబ్ దేశాలు పిలుపునిచ్చాయి. ఇరాన్‌లో చిక్కుకున్న కొంత మంది భారత విద్యార్థులు మంగళవారం సరిహద్దులు దాటి - మిగతా2లో

## 'బనకచర్ల'పై చర్చిద్దాం రండి



- రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, అధికార, విపక్ష ఎంపీలకు సర్కారు విజ్ఞప్తి
- ఫోన్లు, లేఖల ద్వారా ఆహ్వానించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నేటి సాయంత్రం సచివాలయంలో భేటీ.. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్
- ఏపీ ప్రాజెక్టుకు అనుమతులివ్వకుండా కేంద్రంపై ఒత్తిడికి కార్యాచరణ సిద్ధం చేసే యోచన
- అందరి అభిప్రాయాలు, సలహాలను కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం

# 'బనకచర్ల'పై చర్చిద్దాం రండి

హైదరాబాద్

ఏపీ చేపడుతున్న గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును తీవ్రంగా ప్రతిఘటించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణ యించింది. ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమ తులు జారీ చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే అంశంపై ..రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులతో పాటు అధికార, విపక్ష పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల అభిప్రాయాలు, సలహాలను స్వీకరించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం సాయంత్రం 4 గంటలకు సచి వాలయంలో రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్య సభ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వ హించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఈ సమా వేశానికి గౌరవ అతిథు లుగా హాజరు కావాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజ య్‌లకు మంత్రి ఉత్తమ్ స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. అందు బాటులో ఉన్న ఇతర ఎంపీలకు సైతం ఆయన ఫోన్ చేసి ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి ఎంపికైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఎంపీలందరికీ ఆహ్వాన లేఖలను పంపించారు.



**అడ్డుకునే వ్యూహంపై చర్చిద్దాం**

గోదావరి ట్రిబ్యునల్ తీర్పుతో పాటు రాష్ట్ర పున ర్విభజన చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఈ నెల 3న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను.. సీఎం రేవంత్‌రెడ్డి, తాను కలిసిన విషయాన్ని ఎంపీలకు రాసిన లేఖల్లో మంత్రి ఉత్తమ్ గుర్తుచేశారు. అంతేకాకుండా సీఆర్ పాటిల్‌కు తాను లేఖ సైతం రాశానని తెలిపారు. అయితే ఏపీ నుంచి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు ఇంకా అందలేదని, అందిన తర్వాత తమ శాఖ పరిధిలోని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)..అమల్లో ఉన్న నిబంధనలు, ట్రిబ్యునళ్ల తీర్పులు, అంతర్రాష్ట్ర జల ఒప్పందాలతో పాటు ఏపీ పునర్విభజన చట్టంలోని నిబంధనల ఆధారంగా పరిశీలన జరిపి నిర్ణయం తీసుకుంటుందంటూ పాటిల్ హామీ ఇచ్చారని వివరించారు. కాగా ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కోరుతూ ఈ నెల 13న సీఆర్ పాటిల్‌కు మళ్లీ తాను లేఖ రాసినట్టు ఉత్తమ్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టును అడ్డుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి బుధవారం సచివాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

**బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు వస్తారా?**

తెలంగాణకు నష్టం కలిగించనున్న గోదావరి– బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభు త్వానికి లేఖ రాయాలని సీఎం రేవంత్‌రెడ్డికి తాజాగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మరోవైపు ఈ ప్రాజెక్టును అడ్డుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫల మైందని బీఆర్ఎస్ గత కొంత కాలంగా ఆరోప ణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం మంత్రి ఉత్తమ్ నిర్వహించనున్న సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు వస్తారా? అనే అంశం ఆసక్తికరంగా మారింది.

# తుక్కుగూడ డబుల్ ఇళ్ల' లబ్ధిదారుల జాబితా కొట్టివేత

**అధికారులు మార్గదర్శకాల్ని పాటించలేదు**

**అర్హులైన పిటిషనర్లు, ఇతర స్థానికులకు 3 నెలల్లో ఇళ్లు ఇవ్వాలి: హైకోర్టు**

హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మునిసిపాలిటీ పరిధిలోని మంకాళ్‌లో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లకు సంబంధించి 2023 సెప్టెంబరు 2న ప్రకటించిన లబ్ధిదారుల జాబితాను, ఇళ్ల కేటాయింపును హైకోర్టు కొట్టివేసింది. జీహెచ్ఎంసీ పరిధిలోని మలక్‌పేట్, చార్మినార్ తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇక్కడ ఇళ్లు కేటాయించడం చెల్లదని.. స్థానికులమైన తమకు అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు కేటాయించడం లేదని పేర్కొంటూ ఐనాల లక్ష్మమ్మ మరో 13 మంది మంకాళ్ గ్రామస్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిన గ్రామానికి చెందిన వారన్నారు. భూసేకరణ ద్వారా 9.20ఎకరాలు స్థానిక పట్టాదారుల నుంచి సేకరించి, 2700 డబుల్ ఇళ్లు నిర్మించారని తెలిపారు. తాము ఇళ్ల కోసం ఎదురుచూస్తుండగా 2023 సెప్టెంబరు 2న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల జాబితా విడుదల చేశారని.. జీహెచ్ఎంసీ పరిధిలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చార్మినార్, చంద్రాయణగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లు కేటాయించారని వివరించారు. ఆ జాబితాను కొట్టేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకా రం అర్హత ఉన్న పిటిషనర్లు, స్థానికులకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తర పు న్యాయవాదులు వాది స్తూ.. అవి జీహెచ్ఎంసీ పరిధిలోని పేదల కోసం నిర్మించామని, అయినప్పటికీ స్థానిక కోటా కింద కూడా కొన్ని ఇళ్లు కేటాయించామని తెలిపారు. లబ్ధిదారుల జాబితా నిబంధనల ప్రకారమే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ జీవో 10 ప్రకా రం చూసినా రూరల్ జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలకు 50%, మైనారిటీలకు 7%, మిగిలినవి ఇతరులకు కేటాయించాలని, అలాగే అర్బన్ జిల్లాలకు ఎస్సీలకు 17%, ఎస్టీలకు 6, మైనారిటీలకు 12%, మిగతావి ఇతరులకు కేటాయించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. 'ఒక నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్లకు జిల్లా మంత్రి, ఎమ్మెల్యే 50:50 శాతం నిష్పత్తితో లబ్ధిదారులను ఎంపిక చేస్తారని జీవోలో ఉంది. సదరు లబ్ధిదారుల జాబితాలను స్థానిక తహసీల్దార్ లేదా జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీ చేసి గ్రామసభ ఎదుట ఉంచాలి. సామాజిక, ఆర్థిక, కుల గణాంకాల ప్రకారం పరిశీలించి జిల్లా కలెక్టర్ లేదా జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పంపాలి. 2015లో జీవో 12, 2020లో జీవో 3 ద్వారా డబుల్ ఇళ్లకు సంబంధించి అదనపు మార్గదర్శకాలు విడుదల చేశారు. వాటి ప్రకారం కూడా స్థానికులకు వెయ్యి యూనిట్లు లేదా 10% కేటాయించాలని ఉంది. ప్రస్తుత కేసులో 14 మంది పిటిషనర్లు మహేశ్వరం నియోజకవర్గం/మండల పరిధికి చెందిన వారు. ఆ నియోజకవర్గానికి 400 ఇళ్లు కేటాయించారు. జీవో 3 ప్రకారం చూ సినా 10% లేదా వెయ్యి యూనిట్లు కేటాయించాలి. 2023 సెప్టెంబరు 2న లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తే ప్రభుత్వ అధికారులు మార్గదర్శకాలను పాటించలేదని స్పష్టమవుతోంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు మార్గదర్శకాల ప్రకారం ఇళ్లు లభించలేదు' అని ధర్మాసనం పేర్కొంది. లబ్ధిదారుల జాబితాను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. జీవోల ప్రకారం పిటిషనర్లు, ఇతర స్థానికుల అర్హతను పరిశీలించి 3 నెలల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పేర్కొంది.



**రంగారెడ్డి జిల్లాలో కొత్త జాబితాలు ప్రకటించాలి: వీరేందర్‌గౌడ్**

తుక్కుగూడలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను బీఆర్ఎస్ సర్కారు జీహెచ్ఎంసీ పరిధిలోని వారికి కేటాయించడం అక్రమమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. అందుకే హైకోర్టు ఆ జాబితాను కొట్టివేసిందన్నారు. వాస్తవానికి తుక్కుగూడలో కట్టిన ఇళ్లలో ఏకంగా 89% అంటే 2,400 ఇళ్లను ముస్లింలు, అందునా స్థానికేతరులకు కేటాయించారని చెప్పారు. తుక్కుగూడ ప్రాంతంలో ముస్లింల జనాభా 50% కంటే ఎక్కువగా మారేలా వ్యవహరించారని, ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జీవోకు విరుద్ధంగా 89% ఇళ్లు ఒకే వర్గానికి ఎలా ఇచ్చారని కోర్టు ప్రశ్నించిందని వీరేందర్‌గౌడ్ చెప్పారు. ఈ తీర్పును బీజేపీ స్వాగతిస్తోం దన్నారు. మొత్తం రంగారెడ్డి జిల్లాలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు జాబితాలన్నీ రద్దు చేసి, కొత్త జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు

హైదరాబాద్



రెండు నెలల క్రితం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్లను నియమించుకున్న ఆర్టీసీ, ఇప్పుడు అదే పద్ధతిలో కండక్టర్లను కూడా తీసుకునేందుకు సిద్ధమైంది. దాదాపు 800 మంది కండక్టర్లను తాత్కాలిక పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్ రీజియన్ల పరిధిలో ప్రస్తుతానికి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్లను నియమించుకోనుంది. దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనుంది.

**పూర్తి స్థాయి నియామకాల్లో ఎడతెగని జాప్యంతో...**

ప్రస్తుతం ఆర్టీసీలో 2 వేల మంది కండక్టర్ల అవసరముంది. రెగ్యులర్ కండక్టర్లలో దాదాపు 500 మంది ఆర్టీసీ కార్గో సర్వీసు, ఆర్టీసీ పెట్రోల్ బంకులు, సహా ఇతర పలు అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్నారు. గడచిన కొన్ని నెలల్లో 1,500 మంది కండక్టర్లు ఉద్యోగ విరమణ చేయగా భారీ కొరత ఎదురైంది. ప్రస్తుతం సరిపోను కండక్టర్లు విధుల్లో లేకపోవటంతో ఉన్న వారితోనే అదనపు డ్యూటీలు చేయిస్తున్నారు. ఇది కండక్టర్లకు ఇబ్బందిగా మారింది. అదనపు డ్యూటీకి అదనపు చెల్లింపులు ఉంటున్నా, రోజుల్లో 10 నుంచి 12 గంటల పాటు పనిచేయాల్సి రావటంతో వారు తీవ్రంగా అలసిపోతున్నారు. బలవంతపు అదనపు డ్యూటీలు వద్దని చాలా రోజులుగా గగ్గోలు పెడుతున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సహా పలు ఇతర పోస్టులు కలిపి దాదాపు 4 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయా పోస్టులను టీఎస్‌పీఎస్సీ, వైద్యారోగ్య శాఖ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుల ఆధ్వర్యంలో భర్తీ చేయాల్సి ఉంది. కానీ, కొంతకాలం ఆయా బోర్డుల నియామక కేలండర్ పేరుతో, ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ రోస్టర్ ఖరారు పేరుతో జాప్యం జరుగుతూ వస్తోంది. నెలలు గడుస్తున్నా ఆ భర్తీ ప్రక్రియ లేకపోవటంతో క్రమంగా ఆర్టీసీలో ఖాళీల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చి సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో రెగ్యులర్ ఉద్యోగుల భర్తీ జరిగే వరకు తాత్కాలిక పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునేందుకు సంస్థ నిర్ణయించింది. రెండు నెలల క్రితం 1,000 మంది డ్రైవర్లను ఇదే పద్ధతిలో నియమించుకుంది. శిక్షణ పూర్తి చేసుకొని వారు విధుల్లో ఉన్నారు. ఆ తర్వాత కండక్టర్లను కూడా అదే పద్ధతిలో నియమించుకునేందుకు కసరత్తు చేసినా, సచివాలయం నుంచి అనుమతి రాలేదు. మరోసారి విన్నవించగా, రవాణా మంత్రి కార్యాలయం తాజాగా అనుమతించింది. దీంతో నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలో దాదాపు 600 మంది కండక్టర్లు, వరంగల్ రీజియన్ పరిధిలో 200 మందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించుకునేందుకు చర్యలు ప్రారంభించింది.

' ఇలా నియమితులయ్యే వారికి నెలవారీ కన్సాలిడేటెడ్ పేమెంట్ రూ.17,969గా నిర్ధారించారు.

' ప్రతి అదనపు గంట ఓటీకి రూ.100, గంట మించితే రూ.200 చొప్పున చెల్లిస్తారు.

' ప్రతి 6 మస్టర్ల తర్వాత వీక్లీఆఫ్ వసతి ఉంటుంది.

## వాంగ్మూలాల రూపంలో సాక్ష్యాలు

హైదరాబాద్

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో బాధితులు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ముందు వరుస కడుతున్నారు. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, జర్నలిస్టుల ఫోన్లను స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు బృందం అక్రమంగా ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తించిన నేపథ్యంలో వాంగ్మూలాల నమోదు ప్రక్రియ ఊపందుకొంది. మొత్తం 618 మంది బాధితులతో కూడిన జాబితాను సిద్ధం చేసిన సిట్.. సాక్షులుగా వారి వాంగ్మూలాలను రెండు రోజులుగా నమోదు చేస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలోని సిట్‌కు వాంగ్మూలమిచ్చారు. ఎన్నికల సమయంలో తనకు ఎదురైన అనుభవాలను దర్యాప్తు అధికారులకు వివరించారు. తనతోపాటు కుటుంబసభ్యులు, సన్నిహితుల ఫోన్ నంబర్లపై నిఘా ఉంచిన ప్రభాకర్‌రావు బృందం.. క్షేత్రస్థాయిలో తమను ఎలా ఇబ్బందులకు గురిచేసిందో వాంగ్మూలం ద్వారా వెల్లడించినట్లు సమాచారం.

**పార్టీల కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులపైనా నిఘా..**

శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, భాజపా అగ్రనేతలతోపాటు ఆయా పార్టీల రాష్ట్ర కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులపైనా ప్రభాకర్‌రావు బృందం అక్రమంగా నిఘా ఉంచినట్లు సిట్ గుర్తించింది. ఈ నేపథ్యంలో గాంధీభవన్, డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ భవన్‌లోని పలువురు ఉద్యోగుల వాంగ్మూలాలను నమోదు చేస్తోంది. గాంధీభవన్ సీపీఆర్వో హరి, ఎకౌంటెంట్ ప్రతాప్‌రెడ్డి, వార్‌రూం ఇన్‌ఛార్జి విజయభాస్కర్ ఫోన్లు ట్యాప్ అయ్యాయని మంగళవారం వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. భాజపా కార్యాలయంలోని ఉద్యోగులను త్వరలో పిలవనుంది. భాజపా నేత ప్రేమేందర్‌రెడ్డి ఫోన్ సైతం ట్యాప్ అయిందని ఆయననూ విచారణకు పిలిచారు. వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలంటూ భాజపా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సిట్ కోరింది. ముందస్తు కార్యక్రమాల దృష్ట్యా ఈ నెల 22న వస్తానని ఆయన సమాచారమిచ్చినట్లు తెలిసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుటుంబసభ్యుల వ్యాపార సంస్థల్లోని ఉద్యోగుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని... వారినీ విచారణకు పిలవాలని సిట్ నిర్ణయించినట్లు సమాచారం.

**సీఎం కుటుంబసభ్యుల వాంగ్మూలాల నమోదుకూ అవకాశం**

అప్పటి ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కాల్ డిటెయిల్ రికార్డ్(సీడీఆర్)ను అక్రమంగా విశ్లేషించడంతోపాటు ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు, డ్రైవర్లు, ఇంటి పనిమనుషుల ఫోన్లను ట్యాప్ చేశారని సిట్ గుర్తించింది. కామారెడ్డి ఎన్నికపై ప్రత్యేకంగా 'పోల్–2023' పేరిట వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి.. నిందితుడు మేకల తిరుపతన్న పర్యవేక్షణలోని బృందం ఎప్పటికప్పుడు విషయాలు చేరవేసుకుంటూ రేవంత్‌రెడ్డి సోదరులతోపాటు సన్నిహితులను లక్ష్యంగా చేసుకున్నారని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆధారాలు సేకరించిన సిట్.. వీరి వాంగ్మూలాలనూ నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది.

**ప్రభాకర్‌రావుతో ప్రణీత్‌రావు కన్‌ఫ్రంటేషన్ రేపు**

ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన పోలీస్ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్న.. అంతా ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే జరిగిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఎస్ఐబీలోని డేటా ధ్వంసం చేయడంతోపాటు వీరంతా తమ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల్లోని డేటాను తొలగించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై స్పష్టతకు ప్రభాకర్‌రావుతో వీరి కన్‌ఫ్రంటేషన్(ముందుంచి విచారించడాని)కి అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే స్పెషల్ ఆపరేషన్ టార్గెట్(ఎస్వోటీ) పేరిట ప్రత్యేక విభాగాన్ని నడిపించిన ప్రణీత్‌రావును గురువారం ప్రభాకర్‌రావు ముందుంచి విచారించాలని సిట్ నిర్ణయించింది.

## బరాజ్‌లపై నిర్ణయం కేసీఆర్‌దే

-మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ స్వయంగా తీసుకున్న నిర్ణ యాల మేరకే బరాజ్‌లను నిర్మించారని తేల్చి చెప్పింది. బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెల 11న కేసీఆర్‌కు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వ హించగా, మంత్రివర్గ నిర్ణయాల మేరకే బరాజ్‌లను నిర్మించినట్టు బదులిచ్చారు. ఈ నేపథ్యంలో నాటి మంత్రివర్గ సమా వేశాలకు సంబంధించిన మినట్స్ కాపీలను సమర్పించాలని కమిషన్ 13న రాష్ట్ర ప్రభు త్వానికి లేఖ రాసింది. అదే రోజు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్య దర్శి రాహుల్ బొజ్జా కమిషన్‌ను కలిసి వివిధ మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన మినట్స్ కాపీలను అందజేశారు. బరాజ్‌ల నిర్మాణంపై మంత్రివర్గ నిర్ణయాలేమీ జరగలేదని, మాజీ సీఎం కేసీఆర్ మాత్రమే నిర్ణ యం తీసుకున్నారని ఆయన కమిషన్‌కు రాతపూర్వకంగా లేఖ ఇచ్చినట్టు తెలిసింది. వాస్తవానికి కమిషన్ విచారణ ప్రారంభించిన వెంటనే కాళేశ్వ రం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని ఫైళ్లను కమిషన్ కార్యాలయా నికి అందజేసినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. కమిషన్ మంత్రివర్గ నిర్ణయాలను కోరడంతో మళ్లీ అందజేసినట్టు వెల్లడించాయి.

## గో సంరక్షణకు సమగ్ర విధానం



-మొదటిపేజీ తరువాయి

సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలకు భక్తులు పెద్ద సంఖ్యలో గోవులను దానం చేస్తున్నారని, కానీ వాటి సంరక్షణకు తగినంత స్థలం లేకపోవడం, ఇతర సమస్యలతో అవి ఎక్కువ సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలో తొలుత నాలుగు ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం ఆదేశించారు. వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలోని విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలన్నారు. వేములవాడలో కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాలని సీఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలన్నారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన విధానపత్రాన్ని అధికారులు సీఎంకు అందజేశారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సీఎంవో ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

**సీఎంను కలిసిన మంత్రి వివేక్**

సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి వివేక్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సమేతంగా సీఎంను కలిసిన ఆయన.. తనను మంత్రిని చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# విమానాలతో వణుకు

ముంబయి

సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులు విమానాల్లో ప్రయాణికుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఏ విమానం ఎక్కడివరకు వెళ్లి ఆగిపోతుందో, ఏ విమానాశ్రయంలో దిగిపోతోందో అన్నట్లుగా వరస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఎయిరిండియాకు చెందిన మరో బోయింగ్ 777–200 ఎల్‌ఆర్ విమానం (ఏఐ180)లో సాంకేతిక సమస్య తలెత్తింది. 17 మంది సిబ్బంది సహా 228 మందితో ఇది శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ముంబయికి వెళ్తోంది. పాకిస్థాన్ గగనతలంలో భారత్ విమానాలకు అనుమతి లేకపోవడంతో కోల్‌కతాలో సాంకేతిక విరామం తీసుకుని వెళ్లాల్సి ఉంది. ఆ ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటాక 12:45 గంటలకు కోల్‌కతాకు చేరింది. మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు ఇది ముంబయికి బయల్దేరాలి. కానీ సాధారణ తనిఖీల్లో ఎడమ ఇంజిన్లో సాంకేతిక సమస్య బయటపడటంతో పైలట్లు అప్రమత్తమయ్యారు. సమస్య పరిష్కారం కావడం లేదని తెల్లవారుజామున 5:20 గంటలకు ప్రకటించి ప్రయాణికుల్ని కిందికి దింపేశారు. ముంబయి నుంచి వేరే విమానాలను అందుకోవాల్సినవారు తమను త్వరగా గమ్యానికి చేర్చాలని ఒత్తిడి తెచ్చారు. ముందుగా వారందరినీ హోటళ్లకు తరలించారు. 211 మంది ప్రయాణికుల్లో 150 మంది ప్రయాణికుల్ని రాత్రి వేరే విమానంలో పంపించారు. మిగిలినవారు ప్రత్యామ్నాయ సర్వీసులలో తమంతతాముగా వెళ్లారు.

అహ్మదాబాద్ – లండన్ ఎయిరిండియా విమానం రద్దు

అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. టేకాఫ్‌కు ముందే దీనిని గుర్తించడంతో సర్వీసును రద్దు చేశారు. ఎయిరిండియాకు చెందిన ఏఐ–159 బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానం మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరాల్సి ఉంది. రెండు గంటలు ఆలస్యమవుతుందని తొలుత ప్రకటించారు. తర్వాత తనిఖీలు చేస్తుండగా సాంకేతిక సమస్యను గుర్తించారు. సర్వీసును రద్దు చేశారు. గురువారం నాటి విమాన ప్రమాదం తర్వాత లండన్‌కు వెళ్లాల్సిన తొలి షెడ్యూల్డ్ విమానం ఇదే. ఆనాటి ఘటనతో ఏఐ 171 నంబరును ఎయిరిండియా పక్కనబెట్టింది. దాని స్థానంలో ఏఐ 159 నంబరును వినియోగించింది. ఇప్పుడు ఆ విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది. విమానం




అందుబాటులో లేక సర్వీసు రద్దయిందని, సాంకేతిక కారణాలు కాదని ఎయిరిండియా వివరణ ఇచ్చింది. తనిఖీల్లో కొన్ని సమస్యల్ని గుర్తించడంతో ఢిల్లీ–పారిస్ విమాన సర్వీసు (ఏఐ143)ను ఎయిరిండియా రద్దు చేసింది. దీనివల్ల బుధవారం పారిస్ నుంచి ఢిల్లీకి తిరిగి రావాల్సిన విమానం (ఏఐ142) రద్దయిందని ప్రకటించింది. లండన్–అమృత్‌సర్, ఢిల్లీ– నుంచి దుబాయ్, వియెన్నా, పారిస్ వెళ్లాల్సిన విమానాలు, బెంగళూరు–లండన్, ముంబయి–శాన్‌ఫ్రాన్సిస్కో విమాన సర్వీసుల్ని కూడా ఎయిరిండియా రద్దుచేసింది. డీజీసీయే ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టాల్సి రావడం, విమానాలు అందుబాటులో లేకపోవడం దీనికి కారణమని ప్రకటించింది.

**గాల్లో ఉండగా ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు**

నాగ్‌పూర్‌లో అత్యవసరంగా దిగిన ఇండిగో విమానం ఒమన్ రాజధాని మస్కట్ నుంచి కొచ్చిన్ మీదుగా ఢిల్లీకి వెళ్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అత్యవసరంగా నాగ్‌పూర్‌కు మళ్లించారు. ప్రయాణికులందరినీ దించి బాంబు నిర్వీర్యక దళం తనిఖీలు చేపట్టింది. మస్కట్ నుంచి బయల్దేరిన ఈ విమానం మంగళవారం కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేరుకుంది. అక్కడి నుంచి 157 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో ఢిల్లీకి బయల్దేరింది. విమాన సర్వీసు నంబరును నిర్దిష్టంగా ప్రస్తావిస్తూ ఉదయం 9.31 గంటలకు ఈ–మెయిల్‌లో బెదిరింపు లేఖ వచ్చిందని కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయ సంస్థ వెల్లడించింది. దీంతో విమానాన్ని నాగ్‌పూర్‌కు మళ్లించారు. ప్రయాణికులందరినీ దించేసి బాంబు స్క్వాడ్ తనిఖీలు చేసింది. పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లేవని తేలాక ఇది అక్కడినుంచి బయల్దేరింది.

గోవా–లఖ్‌నవూ ఇండిగో విమానం మార్గమధ్యంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల అటూఇటూ ఊగిపోయి హడలెత్తించింది. చివరకు సురక్షితంగా గమ్యాన్ని చేరింది. ఢిల్లీ నుంచి రాంచీకి బయల్దేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ను.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య కారణంగా వెనక్కి మళ్లించారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసి అనుమతించాక విమానం బయల్దేరింది. దీనిలో ఆరుగురు సిబ్బంది సహా 157 మంది ఉన్నారు.

# బాంబుల వర్షం



-మొదటిపేజీ తరువాయి

ఆర్మేనియాలోకి వచ్చారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అత్యంత సీనియర్ సైనికాధికారి, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సన్నిహిత సలహాదారు అయిన అలీ షాద్మానీ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. గతంలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో సీనియర్ సైనికాధికారి అలీ రషీద్ మృతి చెందడంతో.. అలీ షాద్మానీని ఇటీవల సాయుధ దళాలకు నూతన నాయకుడిగా ఖమేనీ నియమించారు. టెహ్రాన్ డౌన్‌టౌన్‌కు సమీపంలోని 3,30,000 మంది ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేసింది. కోటి మంది జనాభా ఉండే ఈ నగరం నుంచి పలువురు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఇప్పటిదాకా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 224 మంది మరణించారు. 1,277 మంది గాయపడ్డారు. టెహ్రాన్ గగన తలంపై పూర్తి నియంత్రణ సాధించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఎప్పుడంటే అప్పుడు తమ యుద్ధ విమానాలు ఇరాన్ రాజధానిపై దాడులు చేయగలవని పేర్కొంది. 120 క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని తెలిపింది. టెహ్రాన్ విమానాశ్రయమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేసింది. అక్కడున్న రెండు ఎఫ్–14 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. దీనికి సంబంధించిన వీడియోలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. దాడుల్లో ఇరాన్ ప్రత్యేక ఎలైట్ దళం కుడ్స్ ఫోర్స్‌కు చెందిన 10 కమాండ్ సెంటర్లు నాశనమైనట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇరాన్ బ్యాంకులపై ఇజ్రాయెల్ సైబర్ దాడులకు పాల్పడుతోంది. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లపై ఇరాన్ పాక్షిక బ్యాన్ విధించింది.

**మొస్సాద్‌కు దెబ్బ**

ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతి దాడులు చేస్తోంది. మంగళవారం దాదాపు 20 బాలిస్టిక్ క్షిపణులను టెల్ అవీవ్‌పై ప్రయోగించడంతో భారీ నష్టం సంభవించినట్లు సమాచారం. పలు భవనాలు, వాహనాలపై క్షిపణులు పడడంతో మంటలు ఎగసిపడుతున్నట్లు తెలిసింది. మొస్సాద్ ప్రధాన కార్యాలయంపైనా ఇరాన్ దాడులు చేసినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లో మొస్సాద్ ఏర్పాటు చేసుకున్న డ్రోన్ ఫ్యాక్టరీని ధ్వంసం చేసింది. గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ సైనిక నిఘా కాంప్లెక్స్‌పైనా క్షిపణి ప్రయోగించినట్లు ఇరాన్ తెలిపింది. ఇప్పటిదాకా 370 క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లో 24 మంది మరణించగా.. 500 మందికిపైగా గాయపడ్డారు.

**అంతకు మించి..**

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్రమవుతున్న వేళ అధ్యక్షుడు ట్రంప్ తన కెనడా పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని అమెరికా చేరుకున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా మంగళవారం ఆయన కెనడాలోనే పర్యటించాల్సి ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతమైతేనే యుద్ధం ఆగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ట్రంప్ హడావుడిగా అమెరికా వెళ్లడం ప్రాధాన్యంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ హడావుడిగా సిచువేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు వచ్చారు. రాగానే రక్షణ మంత్రి హెగ్సెత్‌తో భేటీ అయ్యారు. దీంతో ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో అమెరికా చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సిందే. ఇది సుమారు 13,600 కిలోల బరువుంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి–2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డీగో గార్సియా బేస్‌కు అమెరికా చేర్చింది. రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలనూ పశ్చిమాసియాకు తరలిస్తోంది. బ్రిటన్ తన ఫైటర్‌జెట్లను మోహరిస్తుండటం ఉద్రిక్తతను పెంచుతోంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక ప్రతినిధి విట్‌కాఫ్‌ను ఇరాన్‌తో చర్చల కోసం పంపుతానని ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్‌కే తమ మద్దతు ఉంటుందని జీ7 దేశాల కూటమి ప్రకటించింది. ఇరాన్ ఉగ్రవాద శక్తులను పెంచి పోషిస్తూ పశ్చిమాసియాలో అస్థిరతకు కారణమవుతోందని ఆరోపించింది.

హర్మూజ్ జల సంధిలోని ఇరాన్, ఒమన్ తీరాల సమీపంలో మూడు నౌకలు తగలబడుతున్నట్లు సమాచారం.

**అర్మేనియా చేరుకున్న భారతీయ విద్యార్థులు**

ఇరాన్‌లో చిక్కుకుపోయిన 110 మంది భారతీయ విద్యార్థులు అర్మేనియా చేరుకున్నారని విదేశాంగశాఖ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. బుధవారం వారు ఢిల్లీకి రానున్నారని వెల్లడించింది. మరోవైపు టెహ్రాన్‌లోని భారతీయులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులందరూ సొంత మార్గాల్లో నగరాన్ని వీడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారత రాయబార కార్యాలయం మరో అడ్వైజరీ జారీ చేసింది.

**ఖమేనీ ఎక్కడున్నాడో మాకు తెలుసు: ట్రంప్**

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని సూచించారు. 'ఖమేనీ మాకు సులభమైన లక్ష్యమే. అయితే ఆయనను ప్రస్తుతానికి చంపాలనుకోవడం లేదు. ప్రజలపైనా, అమెరికా సైనికులపైనా క్షిపణులను ప్రయోగించడాన్ని కోరుకోవడంలేదు' అని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికలో ట్రంప్ ప్రకటించారు.

**ఢిల్లీ తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్**

ఇరాన్–ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణవాసులకు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభించింది. ఇప్పటివరకూ రాష్ట్ర వాసులు ఎవరూ ప్రభావితం అయినట్లు సమాచారం లేకపోయినా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందుజాగ్రత్తగా ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలను అనుసరించి తెలంగాణభవన్ అధికారులు విదేశాంగ మంత్రిత్వశాఖతోపాటు, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైన తక్షణసాయం అందించడానికి సిద్ధమైనట్లు తెలిపింది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తాము ఉంటున్న దేశాల్లోకానీ, ప్రయాణాల్లోకానీ ఇబ్బంది పడుతున్న తెలంగాణవాసులు కింద పేర్కొన్న నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. వందన–రెసిడెంట్ కమిషనర్ పీఎస్– ం91 9871999044, జి.రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్– ం91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్– ం91 9910014749, సీహెచ్ చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి– ం91 9949351270.

## కెనడాలో మోదీపై దాడికి ఖలిస్థానీల కుట్ర



టొరంటో

ప్రధాని మోదీ కెనడా పర్యటన సందర్భంగా ఖలిస్థానీ వేర్పాటువాదులు ఆకస్మిక దాడికి కుట్రపన్నారు. జీ7 సదస్సులో పాల్గొనేందుకు మోదీ మంగళవారం కెనడాకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అల్బెర్టా రాష్ట్రంలోని కల్గరీ నగరంలో నిరసన తెలిపేందుకు ఖలిస్థానీ వేర్పాటువాదులు గుమిగూడారు. ఈ కార్యక్రమాన్ని మోదీకి వ్యతిరేకంగా 'ఆకస్మిక దాడి'గా వేర్పాటువాదులు అభివర్ణించుకున్నారు. ఈ సందర్భంగా హింసాత్మక నినాదాలు చేశారు. 'మోదీ రాజకీయాలను చంపేయండి(కిల్ మోదీ పాలిటిక్స్)' అంటూ కెనడా ప్రధాని మార్క్ కార్నీకి నిరసనకారులు పిలుపునిచ్చారు. అలాగే, 'భారత రాజకీయాలను చంపేయండి(కిల్ ఇండియా పాలిటిక్స్)' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరసనకారులు పిలుపునిచ్చారు. కొందరు నిరసనకారులు దూకుడుగా దూసుకొచ్చి త్రివర్ణ పతాకాన్ని కిందపడేసి తొక్కారని, చించివేశారని కెనడా జర్నలిస్టు డానియెల్ బార్డ్‌మన్ తెలిపారు. సిక్స్ ఫర్ జస్టిస్ సంస్థ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఖలిస్థానీ వేర్పాటువాదుల తీరును సిక్కు సంస్థలు ఖండించార

## తక్షణమే ఖాళీ చేయండి

కనానాస్కిస్/వాషింగ్టన్

జీ7 కూటమి శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కెనడాకు చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షెడ్యూల్ కంటే ఒకరోజు ముందే హఠాత్తుగా స్వదేశానికి వెళ్లిపోయారు. కెనడాలో జరగాల్సిన కీలక భేటీలను రద్దు చేసుకున్నారు. ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం ఉధృతంగా మారుతుండడంతో తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించడానికే ఆయన కెనడా పర్యటనను అర్ధంతరంగా ముగించుకొని అమెరికాకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ఖాళీ చేయాలని ట్రంప్ సూచించారు. ఇజ్రాయెల్ దాడులు భీకరంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని చెప్పారు. ఆయన స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం కెనడాలో మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం 'ఎక్స్'లో పోస్టుచేశారు. సాయంత్రం జీ7 దేశాల అధినేతలతో ఫొటోలు దిగారు. "నేను వెంటనే వెనక్కి వెళ్లిపోవాలి. చాలా ముఖ్యం" అని చెప్పారు. ఇంకా ఆలస్యం కాకముందే అణు కార్యక్రమానికి తెరదించాలని ఇరాన్‌కు ట్రంప్ హితవు పలికారు. దాడులు ఆగాలంటే అణ్వస్త్రాల ఆలోచన మానుకోవాలని, ఇజ్రాయెల్‌తో ఒప్పందానికి రావాలని సూచించారు. ఒప్పందం విషయంలో ఇప్పటికే 60 రోజుల సమయం లభించినా ఇరాన్ పాలకులు సద్వినియోగం చేసుకోలేదని తప్పుపట్టారు. మరో గత్యంతరం లేక ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్‌పై దాడులకు దిగిందని అభిప్రాయపడ్డారు. యుద్ధం ఆగాలా? లేక కొనసాగాలా? అనేది ఇరాన్ చేతుల్లోనే ఉందని అమెరికా అధ్యక్షుడు పరోక్షంగా తేల్చిచెప్పారు. ఇజ్రాయెల్%–%ఇరాన్ యుద్ధంలో అమెరికా పాత్ర ఏమిటి? అని ప్రశ్నించగా.. స్పందించడానికి నిరాకరించారు.

**ఇరాన్‌కు అణుబాంబు దక్కదు**

అణు బాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలోకి వచ్చిందని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయినప్పటికీ ఇరాన్ అణు బాంబును తయారు చేసుకొనే అవకాశం ఎంతమాత్రం లేదని స్పష్టంచేశారు. కెనడా నుంచి స్వదేశానికి వస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇరాన్ అణ్వాయుధాలు అభివృద్ధి చేయడం లేదంటూ అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ ఈ ఏడాది మార్చి నెలలో చేసిన ప్రకటనను ట్రంప్ కొట్టిపారేశారు. ఆమె ఏం చెప్పారో తాను పట్టించుకోనన్నారు.

**ఇజ్రాయెల్ సైన్యానిదీ అదేమాట**

టెల్ అవీవ్/టెహ్రాన్: ఇరాన్ అణు స్థావరాలను పూర్తిగా ధ్వంసంచేయాలని, అణు శాస్త్రవేత్తలను, కీలక సైనికాధికారులను అంతమొందించాలని ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మధ్యభాగంలో క్షిపణి దాడులకు సిద్ధమవుతోంది. సెంట్రల్ టెహ్రాన్‌లో ఉంటున్న 3.30 లక్షల మంది బయటకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించింది. టెహ్రాన్‌ను పూర్తిగా ఖాళీ చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పిన కాసేపటికే సైన్యం అదే తరహాలో ఆదేశాలివ్వడం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వ టీవీ, పోలీసు ప్రధాన కార్యాలయాలతోపాటు ముఖ్యమైన ఆసుపత్రులు సెంట్రల్ టెహ్రాన్‌లోనే ఉన్నాయి. రాజధాని నగరంలో 90 లక్షల మందికిపైగా నివసిస్తున్నారు. ఇక్కడ వైమానిక దాడులు జరిగితే ప్రాణనష్టం ఊహించని స్థాయిలో సంభవించే అవకాశం ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం ఆపరేషన్ రైజింగ్ లయన్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

## కిషన్‌రెడ్డి గారూ.. కొంచెం సమయమివ్వండి

"కిషన్‌రెడ్డి గారూ.. మాకు కొంచెం సమయం కేటాయించాల్సిందిగా కోరుతున్నాను. నేను, మన పార్టీ సహచరులు మిమ్మల్ని వ్యక్తిగతంగా కలిసి, సమస్యలను వెల్లడించడం ద్వారా పరస్పర నమ్మకం, స్పష్టతను పునరుద్ధరించాలని కోరుకుంటున్నాం. మీరు ఎక్కడైనా, ఎప్పుడైనా నిర్ణయిస్తే మేము రావడానికి సిద్ధంగా ఉన్నాం. మేము విభజించడానికి కాదు.. ఐక్యతను తీసుకురావడానికి ఇక్కడ ఉన్నాం" అని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తనపై కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాజాసింగ్ స్పందించారు. ఈ మేరకు మంగళవారం రాజాసింగ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "రాజాసింగ్ ఏమి చెబితే దాన్ని మేము పాటిస్తామని మీరు వ్యాఖ్యానించిన నేపథ్యంలో మీకు విన్నవించుకుంటున్నాను. అందరికీ తగిన గౌరవాన్ని ఇస్తూ, ఈ విషయంపై నేను నేరుగా స్పందించాలనుకుంటున్నా. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుపడాలి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలి. నేనెప్పుడూ వ్యక్తిగత లబ్ధి లేదా పదవుల కోసం పని చేయలేదు. నా కృషి ఎప్పుడూ పార్టీని బలోపేతం చేయడంపైనే ఉంటుంది. నన్ను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, నన్ను విడదీసి, అడ్డంకులు సృష్టించడం జరుగుతోంది. అయినప్పటికీ నేను పార్టీకి అంకితమైన, నిస్వార్థ సేవ చేస్తున్నా. ఒక ప్రశ్న వేస్తున్నాను.. ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా? దయచేసి ఆలోచించండి. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభం? ఈ రోజు, నేను నా కోసం కాకుండా.. పార్టీ ఐక్యత కోసం పనిచేస్తున్న లక్షలాది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవడం కోసం మాట్లాడుతున్నాను. తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అవసరమని ప్రజలు ఆశిస్తున్నారు. విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా కలిసి పనిచేద్దాం" అని రాజాసింగ్ కోరారు. 'ఉస్మానియా ఆస్పత్రి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇక్కడ రోగులకు చికిత్స పొందుం దేకు ఉండాల్సిన అనువైన పరిస్థితులు లేవు' అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడ్డారు. మంగళవారం ఆయన ఉస్మానియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డులు, మార్చురీ, అవుట్‌పేషంట్ల విభాగాన్ని పరిశీలించారు. మార్చురీ వద్ద పరిస్థితి ఘోరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలుగు భాషకు 'వేదం' ఎనలేని సేవ


పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున భారత దేశమంతటా అన్ని భాషలలో నూతన వికాసానికి తెర లేచింది. పాశ్చాత్య నాగరికత, అంగ్ల విద్య ప్రభావాలు ప్రజల వేష భాషలపై అనూహ్య ప్రభావాలు చూపా యి. ఇందుకు తెలుగు భాష, ప్రజలకు మినహాయింపు ఏమీ లేకుండే. ఆ సంధి కాలంలో వేంకటరాయ శాస్త్రి ఆగమనము ఆంధ్ర వ్మాయమున క్రొత్త యుగానికి సూచిక అయింది.వేదం వెంకట రాయ శాస్త్రి అంటే ఒక ప్రాచీన పండితుడిని తప్ప, అయన గొప్పతనం గురించి, ఆయన తెలుగు భాషకు చేసిన అమూల్య, అపూర్వ సేవల గురించి, అయన చూపిన నూతన మార్గాల గురించి నేటి తరంలో చాలా మందికి తెలియదు. కనీసం శాస్త్రి ఏమి రచనలు చేశారో కూడా నేటి సాహిత్యాభిమానులకు తెలియదు. గద్య పద్య నాటక విమర్శకాది విషయములలో శాస్త్రి చూపిన మార్గములు అనేకాలు. నాటి కాలంలో శాస్త్రి గ్రంథములు విమర్శకు గురి అయినట్లు ఆధునికులలో ఎవ్వరి గ్రంథాలు కాలేదన్నది వాస్తవం. సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు, నాటకకర్త అయిన వేదం వేంకటరాయ శాస్త్రి... వేంకట రమణశాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు డిసెంబర్ 21, 1853న చెన్నైలో జన్మించారు. 1886లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్ధ వంతంగా నిర్వహించారు. 1887లో బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతం లలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. పరవస్తు చిన్నయసూరికి సహపాఠు లైన, సంస్కృతాంధ్ర ములలో గొప్ప పండితులు అయిన తండ్రి వేంకటరమణ శాస్త్రి ప్రభావం వేంకట రాయ శాస్త్రి పై పడింది. దాని ప్రభావం వ్యవహార భాషా సాంప్రదాయం అనుసరణకు ప్రేరణ అయింది. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించే వారు. ఆయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం ప్రముఖమైనవి. అనేక సంస్కృత నాటకాలను తెనుగించారు.1916లో సూర్యారా



యాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకుడుగా కొంతకాలం పనిచేశారు. అముక్త మాల్యద, శృంగార నైషధ తదితర వ్యాఖ్యలు శాస్త్రి పాండిత్యానికి నిలువుటద్దాలు. ఆముక్త మాల్యద వ్యాఖ్య శతాధిక వసంతాలను చూసింది. 24-6-1920 నాడు ప్రారంభించి 20-10-1920 నాటికి పూర్తి చేసినట్లు ఆయనే తన జీవిత చరిత్రలో సుస్పష్టంగా చెప్పు కున్నారు. ఆముక్తమాల్యద - సంజీవినీ వ్యాఖ్య, భోజ చరిత్ర ము, శ్రీకృష్ణ దేవరాయ, విజయము-నాటకము కథా సరిత్సాగరము పలు భాగాలు, దశకుమార చరితం, శతక వ్మాయ చరిత్ర - ప్రథమ సంపుటం, చరిత్ర రచన - ప్రథమ భాగం, తెనుగు లఘు వ్యాకరణము వ్యామోహము తదితరాలు అయన ప్రముఖ రచనలు. నాగానందం, బొబ్బిలి యుద్ధం, ఉత్తరరామ చరిత, ఆంధ్ర విక్రమోర్వశీయ, ప్రతాపరుద్రీయ, ఉషా నాటకము ప్రియదర్శికాది నాటకములు, అమర కావ్యం, ఆంధ్ర హితోపదేశము - చంపువు, శ్రీ శారదా కాంచిక, ఆంధ్ర బిల్హణీయము, విక్రమార్క చరిత్రము, కావ్యాలంకార చూడామణి, మేఘ సందేశం వ్యాఖ్యానం, ఉదయన చరిత్రము, భరతాభారత రూపక మర్యాదలు, తిక్కన సోమయాజి విజయము, ఆంధ్రవ్యాకరణ సర్వస్వ తత్త్వము, ఆంధ్ర భాషా సర్వస్వ నియమ కతిపయములు, ఆంధ్ర సాహిత్య దర్పణము, విమర్శ వినోదము, ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శనము, తానాషా అక్కన్న మాదన్నలు, ఆంధ్ర రత్నావళీ నాటిక, సారంగధర చరిత్రము, పుష్పబాణ విలాసం, రసమంజరీ, కుమార సంభవము వ్యాఖ్య, ఉదయన చరిత్రము, పంచ తంత్రం, ఆంధ్ర దశకుమార చరిత్రము తదితర రచనలు గావించారు. 1920లో ఆంధ్ర మహా సభ చేత 'మహోపాధ్యాయ' బిరుదు పొందారు. 1922లో ద్వారక పీఠ శంకరభగవత్పాదులచేత 'సర్వ తంత్ర స్వతంత్ర', 'మహా మహోపాధ్యాయ', 'విద్యా దాన వ్రత మహోదధి' అనే సత్కారాలు పొందారు.1927లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చేత 'కళా ప్రపూర్ణ' గౌరవంతో సన్మానించ బడ్డారు. 1958లో కుమార సంభవ ప్రబంధకర్త నన్నెచోడుని కవిత్వంపై వీరు రాసిన 'నన్నెచోడుని కవిత్వము' అనే విమర్శనా గ్రంథానికి 'ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి' బహుమతి లభించింది. వెంకటరాయ శాస్త్రి 1929, జూన్ 18న మద్రాసులో మరణించారు.

# సామాజిక చైతన్యానికి కలం పట్టిన మహాశిల్పి

రష్యా విప్లవ సాహిత్యానికి శిల్పి, కార్మిక వర్గపు మౌనమైన ధ్వనికి శబ్దరూపం ఇచ్చిన గొప్ప రచయిత మాక్సిం గోర్కీ. ఆయన అసలు పేరు అలెక్సీ మక్సిమోవిచ్ పేశ్కోవ్. 1868 మార్చి 28న నీజ్నీ నోవ్గొరోడ్ పట్టణంలో జన్మించిన గోర్కీ, 1936 జూన్ 18న మాస్కోలో మరణించాడు. తన రచనల ద్వారా సామాజిక వాస్తవికతకు స్థాపకుడిగా నిలిచిన గోర్కీ, అంతర్జాతీయ స్థాయిలో సాహిత్యానికి, విప్లవాలకు ఒక ధ్రువ తారగా మారాడు. బాల్యం నుంచి ఎదురైన కష్టాలే అయన రచనా శక్తికి మూల పునాది. తల్లిదండ్రులను చిన్న వయసులో కోల్పోయి అనాథుడిగా మిగిలిన గోర్కీ, ఎన్నో కష్టాలు తలపడి, వివిధ పని వర్గాల్లో పనిచేస్తూ జీవితాన్ని అనుభవించాడు. యాచకుడిగా, ముద్రణ కార్మికుడిగా, నౌకల్లో సహాయకుడిగా ఎన్నో జీవన పాత్రలు పోషిస్తూ, సమాజంలోని అట్టడుగు వర్గాల జీవితాన్ని దగ్గరగా గమనించాడు. ఇదే అనుభవ సంపత్తి అతని రచనలకు జీవన వివేకాన్ని అందించింది. 1892లో "మకార్ చుద్రా" కథతో రచనా ప్రస్థానాన్ని ప్రారంభించిన గోర్కీ, అనంతరం అనేక నవలలు, నాటకాలు, కథలు, వ్యాసాలు రచించాడు. వాటిలో ముఖ్యమైనవి ం "అమ్మ" (1906), "నా బాల్యం", "నా విశ్వవిద్యాలయాలు", "ది లోయర్ డెప్త్స్", తదితర రచనలు. "అమ్మ" నవల ప్రపంచ విప్లవ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన కావ్యం. ఒక కార్మికుడి తల్లి, తన కొడుకు విప్లవ మార్గంలో పయనించడాన్ని చూసి, తానూ ఆ ఉద్యమంలో భాగమవడం అనే ఇతివృత్తం ద్వారా విప్లవ భావజాలాన్ని గుండెల్లో నాటుతుంది. ఈ నవల లెనిన్ చేత మెచ్చుకో బడింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషల్లో అనువాదమై, తెలుగులోనూ



విస్తృత ప్రచారం పొందింది. ంష్త్రవ ాాశీషవతీ ణవజ్ూష్త్రం నాటకంలో గోర్కీ, పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న వర్గాల జీవితాన్ని నిర్మొహమాటంగా చిత్రించాడు. మానవ అశక్తి, ఆశ, నిరాశలను గాఢంగా దర్శించిన ఈ నాటకం, తాత్వికతకు చేరువైన వాస్తవిక చిత్రణగా నిలుస్తుంది. "నా బాల్యం", "నా విశ్వవిద్యాలయాలు" వంటి స్వీయ చరిత్రాత్మక రచనలు గోర్కీ జీవితాన్ని అక్షర రూపంలో చెరిపి వేయకుండా నిలిపే ప్రయత్నంగా పేర్కొనవచ్చు. రచయిత గానే కాక, రాజకీయ చింతన కారుడిగా గోర్కీ ప్రభావం విశేషం. సోషలిస్ట్ భావజాలాన్ని సమర్థించిన గోర్కీ, బోల్షెవిక్ విప్లవానికి మద్దతు తెలిపాడు. లెనిన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నా, కొంతకాలం స్టాలిన్ విధానాలను విమర్శించాడు. కానీ తరువాత అధికారంతో మెలగడం ప్రారంభించాడు. ఈ మార్పు ఆయన వ్యాపకమైన విప్లవ ఆత్మ చింతనకు సంకేతంగా మారింది. గోర్కీ రచనలు కాలాతీతమైన సామాజిక సందేశాల ప్రతి రూపాలు. వాస్తవికత, మానవతా స్పర్శ, శ్రమ జీవుల జీవన పోరాటాలే ఆయన సాహిత్య శైలికి మూలాధారాలు. సోవియట్ యూనియన్‌లో ఆయన పేరు మీద నగరాలు, వర్సిటీలు, సంస్థలు స్థాపించ బడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా విప్లవ కారులకు, సామాజిక సంస్కర్తలకు ఆయన రచనలు ప్రేరణగా నిలిచాయి. గోర్కీ జీవితం మనకు ఒక మూల సందేశాన్ని అందిస్తుంది ం సాహిత్యం వినోదానికి మాత్రమే కాదు, సమాజాన్ని మేల్కొలిపే శక్తిగా నిలవాలన్నది నిజమైన రచయిత ధర్మం. దుఃఖాల దారుల్లో నడిచి వెలుగుకు దారిచూపిన ఆయన జీవితమే ఈ ధర్మానికి ప్రత్యక్ష సాక్ష్యం. అన్యాయానికి ఎదిరించిన కళాన్ని, సమాజ మార్పుకు శబ్దాన్ని అందించిన కలాన్ని గోర్కీ కలం మలిచింది. అలాంటి కలం నుంచి జారిన ప్రతి అక్షరం ం సమాజపు మార్పు కోసం శ్రమజీవుల గుండె చప్పుళ్ళ ప్రతిధ్వనిగా మారింది. మాక్సిం గోర్కీ రచనలు యుగయుగాలకూ సామాజిక సమరానికి శబ్దరూపంగా నిలుస్తాయి.

# గండవరం జీవితం నాటక రంగానికి అంకితం

గండవరం సుబ్బరామిరెడ్డి (1937 - జూన్ 18, 2017) ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకులు, నిర్వహకులు, విమర్శకులు. ఆయన 1937 సంవత్సరంలో జానకమ్మ, బలరామిరెడ్డి దంపతులకు నెల్లూరు జిల్లా లోని గూడూరులో జన్మించారు. ఉన్నత పాఠశాల చదువు గూడూరులో పూర్తిచేసి, నెల్లూరు లోని వి.ఆర్.కాలేజీలో బి.ఏ పట్టభద్రులయ్యారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహాయ కార్యదర్శిగా పనిచేసి, 1995లో పదవీ విరమణ చేశారు. 1952నుండే రంగస్థలంతో అనుబంధం ఉంది. విద్యార్థిగా ఉన్నప్పుడే మమత అనే నాటిక రాసి స్కూలు వార్షికోత్సవాలలో ప్రదర్శింప చేసారు. నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో ఏది మార్గం అనే నాటిక రాసి ప్రదర్శింపచేసి, ఉత్తమ నిర్వహణ బహుమతి పొందారు. నాటక రచన, పాత్ర పోషణ, విమర్శ, పరిశోధన వీరి ప్రత్యేకతలు. మన ఊరు, శిఖరం కూలింది, వెంటాడే నీడలు అనే రంగస్థల నాటికలు, నీరు పల్లమెరుగు, చీమలు పెట్టిన పుట్టలు, నయనతార అనే రేడియో నాటకాలు రాశారు. వెలుగు పూలు అనే కార్యక్రమానికి 105 ఎపిసోడ్‌ల స్క్రిప్ట్ రాశారు. నాటకరంగం పై సుమారు 300 వ్యాసాలు వివిధ పత్రికలకు రాశారు. తెలుగు నాటకరంగం పైన, అటు పాశ్చాత్య నాటకరంగం పైన పరిశోధన చేసి ఆధునిక తెలుగు నాటకం అనే పుస్తకంగా 1860నుంచి 1985 వరకు వచ్చిన మార్పులు రాశారు. గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు డ్రామా అనే పేరుతో ఇంగ్లీషులో తెలుగు నాటక రచయితల రచనలపైన గ్రంథం రచించారు. మూడు ప్రసిద్ధ నాటకాలు అయిన వరవిక్రయం, నిజం, గయోపాఖ్యానం పైన విమర్శనాత్మక గ్రంథాలు రాశారు. ఆంధ్రదేశంలోని తెలంగాణ, ఆంధ్రా రాయలసీమ జిల్లాలలోనే కాక రాష్ట్రేతర పరిషత్తుల్లో కూడా నిర్వహించిన ఎన్నో నాటక పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. అనేక ప్రతిష్ఠాత్మక పరిషత్ నాటకాలకు 77సార్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అమెరికాలోని తెలుగు సంస్థ ఆటావారు 1998లో నిర్వహించిన ప్రపంచ నాటక రచన పోటీలకు కూడా న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. సుమారు మూడుసార్లు అమెరికాలో పర్యటించి అక్కడి రంగస్థల విశేషాలను గమనించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గ్రంథానికి సంగ్రహ సంపాదకులుగా వ్యవహరించి నాటక విజ్ఞాన సర్వస్వం అనే గ్రంథాన్నినాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. ఉత్తమ సాహితీ విమర్శకునిగా ఆరాధనా జవ్వాది ట్రస్ట్, లలిత కళాసమితి వారి ఉగాది పురస్కారం, విశేష నాటక రంగ కృషివలుడుగా నార్ల ఫౌండేషన్‌వారి పురస్కారం, అభినయ స్టేజ్ అవార్డ్ తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డులు పొందారు. జీవన సాఫల్య పురస్కారం (ప్రగతి కళామండలి, సత్తెనపల్లి- త్యాగరాయ గానసభ, హైదరాబాదు, 8 ఆగస్టు 2016 తదితర అవార్డులు అందు కున్నారు. గూడూరులోని సాంస్కృతిక సమ్మేళనం, కాళిదాసు కళానికేతన్ లకు వ్యవస్థాపక సభ్యులుగా ఉంటూ సుమారు 50 సంవత్సరాలపాటు రాష్ట్రస్థాయి నాటక పోటీలు, సంగీత పోటీలు నిర్వహించారు. ఆయన 2017, జూన్ 18న హైదరాబాద్ లో మరణించారు


# విమానయానం గాలిలో దీపం

ఈ ఏడాది కేదార్‌నాథ్ యాత్ర సీజన్‌లో వరసగా చోటు చేసుకొంటున్న హెలికాప్టర్ ప్రమాదాలు ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఆదివారం కేదార్‌నాథ్‌నుంచి గౌరీకుండ్‌కు వస్తున్న హెలికాప్టర్ గుప్తకాశి వద్ద కూలిపోవడంతో పైలట్, రెండేళ్ల చిన్నారి సహా హెలికాప్టర్‌లోని మొత్తం ఏడుగురూ చనిపోయారు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన నెలన్నర రోజుల్లోనే ఇది అయిదో హెలికాప్టర్ ప్రమాదం కావడం గమనార్హం. ఇంతకు ముందు కూడా గత మే 8న ఉత్తర కాశీలో గంగోత్రికి యాత్రికులను తీసుకు వెళ్తున్న హెలికాప్టర్ లోయలో పడిపోవడంతో ఆరుగురు ప్రయాణికులు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో మూడు హెలికాప్టర్ ప్రమాదాలు సంభవించినప్పటికీ అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. అయితే నెలన్నర వ్యవధిలోనే ఇన్ని హెలికాప్టర్ ప్రమాదాలు ఎందుకు జరిగాయి? దీనికి కారణాలేమిటి? అన్న ప్రశ్నలు ప్రతిఒక్కరిలో తలెత్తుతున్నాయి. ఆదివారం జరిగిన ప్రమాదానికి వాతావరణం హటాత్తుగా ప్రతికూలంగా మారడమే కారణమని తెలుస్తోంది. పైలట్ దట్టమైన పొగమంచు మధ్యలోకి వెళ్లి ఉండవచ్చని, ఎదురుగా ఏముందో కూడా కనిపించని స్థితిలో హెలికాప్టర్ కొండను ఢీకొని కూలిపోయి ఉంటుందని నిపుణులు అంటున్నారు. అయితే ప్రమాదం జరిగిన తీరు గమనిస్తే నిర్వాహకుల నిర్లక్షం కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ ప్రమాదం తెల్లవారు జామున 5.17 గంటల సమయంలో జరిగింది. వాస్తవానికి కేదార్‌నాథ్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉదయం 6 గంటలతర్వాతినుంచి సాయంత్రం వరకు మాత్రమే హెలికాప్టర్ సేవలకు అనుమతి ఉంది. దీనికి భిన్నంగా ఆర్యన్ ఏవియేషన్ లిమిటెడ్‌కు చెందిన హెలికాప్టర్ తెల్లవారుజామునే బయలుదేరడాన్ని గమనిస్తే నిర్వాహకుల నిర్లక్షం ఎంత ఉందో అర్థం అవుతుంది. కేదార్‌నాథ్ ఆలయం హిమాలయ పర్వతాల మధ్య ఉంది. ఇక్కడ వాతావరణం క్షణాల్లో మారిపోతూ ఉంటుంది. పైగా అంతా నిటారయిన కొండలు, లోయలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. అలాంటప్పుడు భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఉత్తరాఖండ్ ప్రభుత్వం హెలికాప్టర్ సేవలకు అనుమతించింది కానీ భద్రత విషయాలను పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించదు. కంట్రోల్ టవర్స్ కానీ, వాతావరణానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని అందించే ఏర్పాట్లు కానీ లేకపోవడంతో హెలికాప్టర్ ఆపరేటర్లు తమ ఇష్టానుసారం హెలికాప్టర్ సర్వీసులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హెలికాప్టర్ ప్రమాదం తర్వాత ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి చేసిన ప్రకటన సైతం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అత్యవసర సమావేశం నిర్వహించాక రెండు రోజులు పాటు కేదార్‌నాథ్‌కు హెలికాప్టర్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలకోసం కఠినమైన నిబంధనావళిని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతేకాకుండా డిజిసిఎ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కూడా ఏవియేషన్ కంపెనీలను ఆదేశించారు. హెలికాప్టర్ సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటుగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. ఇదంతా బాగానే ఉంది కానీ చార్‌ధామ్ యాత్రకోసం చాలా ఏళ్ల క్రితమే హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించిన రాష్ట్రప్రభుత్వం ఇంతకాలంగా ఈ అంశాలపై ఎందుకు దృష్టిపెట్టలేదనే ప్రశ్న ఎవరికైనా వస్తుంది. 2010లో హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభమయ్యాయి కానీ ఇప్పటివరకు భద్రత విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకున్నట్లు కనిపించదు. వాస్తవానికి కేదార్‌నాథ్ యాత్ర అత్యంత శ్రమతో కూడుకున్నది. గతంలో దుర్గమమైన పర్వత మార్గలో కాలినడకన, వృద్ధులు, పిల్లలు లాంటి వారయితే గుర్రాల మీద ఆలయానికి చేరుకునే వారు. అయితే హెలికాప్టర్ సర్వీసును ప్రవేశపెట్టిన తర్వాత రోజు రోజుకు దానికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ ఏజన్సీ ఐఆర్‌సిటిసితో పాటుగా పలు ప్రైవేటు ఏవియేషన్ కంపెనీలు హెలికాప్టర్ బుకింగ్‌తో పాటు సర్వీసులను కొనసాగిస్తున్నాయి. యాత్రికులు సైతం ఈ సర్వీసులకే ఎక్కువ మొగ్గు చూపుతుండడంతో ఏవియేషన్ కంపెనీల మధ్య అనారోగ్యకరమైన పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా ఈ ఏడాది కేవలం 40 రోజుల్లోనే అయిదు ప్రమాదాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దాదాపు 280 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్ల ముందు మెదులుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదాలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. దట్టమైన మంచు కారణంగా చార్‌ధామ్ యాత్రలో భాగమైన నాలుగు ఆలయాలను ఏడాదిలో ఆరు నెలల పాటు మూసి ఉంచుతారనే విషయం అందరికీ తెలిసిందే. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి పర్యాటకం ప్రధాన ఆదాయ వనరు కావడంతో ఈ యాత్ర కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ ఉంటుంది. దీంతో భక్తుల సంఖ్య కూడా ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. అదే ఇప్పుడు సమస్యలకు కారణమవుతోంది. ఆదాయంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపైన కూడా శ్రద్ధ చూపించాల్సి ఉంటుంది. వరస ప్రమాదాల తర్వాతనైనా రాష్ట్రప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించడం మంచి పరిణామమే. హెలికాప్టర్ సేవలపై నిఘాతో పాటుగా వాటి క్రమబద్ధీకరణ, వాతావరణంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయడంలాంటి చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చు. ఎంతో శ్రమకు ఓర్చి చార్‌ధామ్ యాత్రకు వచ్చే భక్తులు క్షేమంగా, యాత్ర ముగించుకుని స్వస్థలాలకు

# ముష్కిన్ చెరువు సంరక్షణకు బీఆర్ఎస్ చొరవ

## బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ






**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ముష్కిన్ చెరువు సంరక్షణకు బీఆర్ఎస్ పార్టీ తరపున కృషి చేయడం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ అన్నారు. హైడ్రా, హెచ్ఎండిఏ వారు చేపట్టిన ముష్కిన్ చెరువు అభివృద్ధి పనులను మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముష్కిన్ చెరువు ఒకప్పుడు సర్వే నెంబర్ 376, 255, 257, 258, 259, 260 ల ప్రకారం 52 ఎకరాలు ఉండాల్సిన చెరువు అన్యక్రాంతమై 12 ఎకరాలకు కుచించుకుపోయిందని స్థానికులు తెలుపుతున్నట్లు వివరించారు. ఈ విషయమై మూడు నెలల క్రితం పర్యటించినప్పుడు చెరువును కాపాడాలని దీన్ని అభివృద్ధి చేసి ప్రజలకు పర్యాటక ప్రాంతంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరామన్నారు. ప్రస్తుతము సర్వే నెంబర్ 259 లో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ బందు నిర్మించి అభివృద్ధి చేస్తున్నారని, ఈ బండ్ కడుతున్న కారణంగా సహజ నీటి ప్రవాహానికి అడ్డుకట్టగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ బండ్ ఆనుకొని వర్షపు నీరు పారడానికి కాలువ తవ్వుతున్న దృశ్యాలు కనపడ్డాయన్నారు. ఈ కాలువ ద్వారా వర్షపునీరు కన్నా రాబోయే కాలంలో ఆ పక్కనే చిన్న మురికి కాలువ ద్వారా ప్రవహిస్తున్న మురుగు నీరు పొంగి ఈ కాలువలో ప్రవేశించి రాబోయే కాలం ముష్కిన్ చెరువు మొత్తం మురుగు నీరు నిండే అవకాశం ఉందన్నారు. చుట్టు పక్కల నుంచి ప్రవహించే మురుగు నీరుకి సరియైన వ్యవస్థ నిర్మించకుండా వదిలేస్తే ఆ మురుగు నీరు మొత్తం ముష్టి చెరువును ముంచెత్తే అవకాశం ఉందన్నారు. చుట్టుపక్కల తుమ్మ చెట్లు పెరిగిన కారణంగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపుతున్నారని, వారిని నివారించడానికి వెళ్ళినప్పుడు వారు స్థానికుల మీద, ఇప్పుడు అభివృద్ధి పనులు చూస్తున్న సూపర్వైజర్ల మీద దాడి చేయబోయినట్టు తెలిసిందన్నారు. గతంలో సైతం ఈ అసాంఘిక కార్యక్రమాల గురించి, అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రం గురించి అధికారులు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఏ రకమైన చర్యలు చేపట్టకపోవడం అసాంఘిక కార్యక్రమాలకు ప్రోత్సాహాన్ని ఇచ్చినట్టు ఉందన్నారు. హాల్ మార్క్ విసినియా అపార్ట్మెంట్స్ ఎదురు గుండా ఉన్న రెడీమిక్స్ ప్లాంట్ ను హైకోర్టు మూసి వేయమని ఒక నెలన్నర క్రితం తీర్పు ఇచ్చినప్పటికీ ఆ రెడీమిక్స్ ప్లాంట్ ముందు ఉన్న రోడ్డును వారు ధ్వంసం చేసిన దానికి వారిపై మణికొండ మున్సిపాలిటీ వారు ఏ రకమైన చర్యలు చేపట్టకపోవడం, ఆ రోడ్డును పునర్నిర్మించకపోవడం వారి పరిపాలన తీరును తెలియజేస్తుందన్నారు. కాబట్టి అధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రాంతంలో ఉన్న మురుగునీటి వ్యవస్థ, అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెట్టడం, రోడ్డును పునర్ నిర్మించాలన్నారు. ఈ మేరకు అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, గోరుకంటి విఠల్, సంగం శ్రీకాంత్, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరీఫ్, యాలాల కిరణ్, జై రామ్, సుమనళిని, బాబురావు, కందాడ ప్రవీణ్ కుమార్, చెరుకూరి బాలాజీ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 'పిఓబీ' సమస్యతో అల్లాడుతున్న రైతులు

## రాందాస్పల్లి సర్వే నెం.41 భూములపై క్లారిటీ ఇవ్వాలని తహసీల్దార్‌కు రైతుల వినతి





**రంగారెడ్డి జిల్లా, ప్రభాత సూర్య :** ఇబ్రహీంపట్నం మండలంలోని రాందాస్పల్లి గ్రామ రైతులు తమ భూములపై అన్యాయం జరుగుతోందంటూ రెవెన్యూ అధికారుల వద్దకు నిరంతరంగా ఫిర్యాదులు చేస్తూ నిరసన తెలుపుతున్నారు. గ్రామ పరిధిలోని సర్వే నంబరు 41లో ఉన్న దాదాపు 1251 ఎకరాల భూములు, రైతుల సొంత పట్టాదారుల భూములు అయినప్పటికీ 'ప్రోబిటెట్ ఆక్యుపెన్సి బుక్' లో నమోదవుతూ మోదులే – 15 క్రింద అప్లికేషన్లు తిరస్కరించబడుతున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. రైతుల ఆరోపణల ప్రకారం, గత మూడు సంవత్సరాలుగా తహసీల్దార్ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయానికి, అక్కడినుంచి కలెక్టర్ కార్యాలయానికి ఫైళ్లు పంపించడమే జరుగుతోందనీ, తగిన నిర్ణయం లేకపోవడం వల్ల అన్యాయం ఎదురవుతోందని వారు చెబుతున్నారు.

**ఏడి సర్వేయర్ నివేదికతో కలవరం..**

సర్వే నెం.41 భూములపై ఏడి సర్వేయర్ నివేదిక ఇచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రైతులు తెలిపారు. "ఆ సర్వేలోని భూములు గవర్నమెంట్ ల్యాండ్ అని ప్రకటించడంతో, అప్పటి నుండి మా అప్లికేషన్లన్నీ నిషేధిత భూములుగా గణించబడి తిరస్కరించబడుతున్నాయి" అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ భూముల్లో కేవలం 93 ఎకరాలు మాత్రమే బాండెడ్ లేబర్ లకు అప్పగించబడినవని, మిగిలిన 1158 ఎకరాలు రైతుల సొంతమైన భూములేనని వారు స్పష్టం చేశారు. అయినప్పటికీ మొత్తం భూమినే గవర్నమెంట్ భూమిగా పరిగణించి, రైతుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపిస్తున్నారు. సమస్య గ్రామ స్థాయిలో పరిష్కరించాలి...ఏడి సర్వేయార్ ఈ అంశం ఇప్పుడు పూర్తిగా గ్రామ సమస్యగా మారిన నేపథ్యంలో, తహసీల్దార్ స్వయంగా దృష్టి సారించి, పునఃసమీక్ష కోసం ఏడి సర్వేయర్ నుంచి స్పష్టమైన నివేదిక తెప్పించి, రిపోర్ట్ ఆధారంగా పివోబీ లలోని రైతుల భూములను తొలగించాలి అనే డిమాండ్ జోరందుకుంది.

రైతుల మాటల్లో చెప్పాలంటే

"మన భూములు మనకే దక్కాలన్నదే మా లక్ష్యం. అధికారుల మధ్య ఫైళ్ల చలామణి జరుగుతూ మేము నష్టపోతున్నాం. దీనికి శాశ్వత పరిష్కారం కావాలి."

**తహసీల్దార్, కలెక్టర్ కలగజేసుకోవాలని విజ్ఞప్తి**

రైతుల సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు తహసీల్దార్ తక్షణం స్పందించి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అకారణంగా తమ భూములు నిషేధిత జాబితాలో ఉండటం వల్ల రుణాలు, పత్తా హక్కులు, సాగు ప్రయోజనాలన్నీ నష్టమవుతున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# లిస్టులో పేర్లు వచ్చిన వాటిని ఎందుకు మారుస్తున్నారు?

**ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయాలు తగవు**

**ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి**

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా**




**భువనగిరి, ( సూర్య ప్రతినిధి ):** ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ 7 ప్రకారం అర్హత ఉన్న నిరుపేదలైన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మొదటి ప్రాధాన్యతగా గుర్తించి ఇవ్వాలని, ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో రాజకీయాలు తగవని, ఇప్పటికైనా ఇండ్లు కావలసిన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో సిపిఎం భువనగిరి మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్ అధ్యక్షతన జరుగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వము లాగా కాకుండా సంక్షేమ పథకాలను అర్హత కలిగిన వారందరికీ అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కొక్క గ్రామంలో నిజమైన లబ్ధిదారులను పదుల సంఖ్యలో తొలగిస్తున్నారని నర్సింహ ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాలలో నిజమైన లబ్ధిదారులను మరో మారు గ్రామ సభలు పెట్టి అందరి సమక్షంలో ఎంపిక చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ కాంగ్రెస్ గ్రామ కమిటీలుగా మారాయని అన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చూడాలని గ్రామాల అభివృద్ధిల విషయంలో, సంక్షేమ పథకాల విషయంలో లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో ప్రజలందరినీ, అన్ని రాజకీయ పార్టీలను సంప్రదించి అందరి సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తేనే నిజమైన పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఇవ్వకపోతే మండల వ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో పేదలను సమీకరించి గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఆందోళన చేపడుతామని నర్సింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ , కొండమడుగు నాగమణి, మండల కమిటీ సభ్యులు సిలువేరు ఎల్లయ్య , పాండాల మైసయ్య , కొండపురం యాదగిరి, మధ్యపురం బాల నరసింహ, కళ్లెం లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాభ్యాసానికి అక్షర కేంద్రాలు అంగన్వాడీ లు

**జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత**



**ఎల్బీనగర్, ప్రభాత సూర్య :** అక్షరాభ్యాసానికి అక్షర కేంద్రాలు అంగన్వాడీ కేంద్రాలు అని రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత అన్నారు. ఎన్టీఆర్ నగర్ ఫేస్ 3 కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని ఐదు ఏళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అక్షరాభ్యాసం తో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తుంది అని ఆమె వివరించారు. మధ్యాహ్న భోజనం, పాలు, గుడ్లు తదితర ఆహార పదార్థాలను ఉచితంగా ఇస్తున్నామని ఆమె తెలిపారు. ఏడు నెలల వయస్సు నుంచి మూడు సంవత్సరాల వయస్సు వరకు బాలామృతం, గుడ్లు ఇంటికి సరఫరా చేస్తామని ఆమె వివరించారు. మూడు సంవత్సరాల వయస్సు నుంచి ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న బాల బాలికలను ఖచ్చితంగా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సిడిపిఓ రేణుక, సూపర్ వైజర్ సావిత్రి, యాదగిరి, అంగన్వాడీ టీచర్లు గంగా, పుష్పలత, సునీత ఆశా వర్కర్లు హేమలత, వెంకటమ్మ, అంజమ్మ, కళమ్మ బాలబాలికలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సిపిఐ 15 వ మండల మహాసభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగొని గాలయ్య**



**సంస్థాన్ నారాయణపూర్, ( సూర్య ప్రతినిధి):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల 15 వ మహాసభ ఈనెల 27న నారాయణపూర్ మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని ఈ యొక్క మండల మహాసభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు మంగళవారం నారాయణపూర్ చౌరస్తాలో మండల మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాలయ్య మాట్లాడుతూ సిపిఐ పార్టీ మన దేశంలో 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ లో స్థాపించబడి ఈ డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. దేశ స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించి భారతదేశానికి సంపూర్ణమైన స్వాతంత్రం కావాలని తెలంగాణలో నైజాం రాజరిక వ్యవస్థ నిర్మూలన కొరకు భూస్వామ్య దొరల పెత్తందారి వ్యవస్థ నుండి పేద ప్రజల విముక్తి కొరకు దున్నేవారికి భూమి కావాలని రైతు కూలీలను సంఘటిత పరిచి, పీడిత ప్రజల పక్షాన నిలబడి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందు బాగాన నిలబడి పోరాటం నిర్వహించిన పార్టీ సిపిఐ. అదేవిధంగా నారాయణపూర్ మండల సమగ్ర అభివృద్ధి కొరకు త్రాగు సాగునీరు కావాలని రెండుసార్లు పాదయాత్ర చేసి ఈ మండలానికి త్రాగునీరు తీసుకురావడంలో సిపిఐ ది కీలక పాత్ర. కావున పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు హాజరై మండల మహాసభను విజయవంతం చేయగలరని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ కలకొండ సంజీవ చిలువేరు అంజయ్య పొట్ట శంకరయ్య, ఏఐవైఎఫ్ నాయకులు కొండూరు వెంకటేష్, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ, మంచాల జంగయ్య,పల్లె మల్లారెడ్డి, ముత్యాల అంజయ్య, తోకల రామ్ రెడ్డి, పందుల యాదగిరి,భీమనపల్లి గాలయ్య, కప్పల నరసింహ, గుండు నరసింహ తదితరులు పాల్గొన్నారు .

## తుర్క కాశ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని

**ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ కి వినతి పత్రం అందజేసిన ఎస్కే బడేసాబ్**



**సంస్థాన్ నారాయణపూర్, ( సూర్య ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర తుర్క కాశ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వారి క్యాంపు కార్యాలయం నాంపల్లి లో ఎమ్మెల్సీ ఆమెర్ అలీ ఖాన్ కి తెలంగాణ తుర్క కాశ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే బడేసాబ్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం లో తుర్క కాశ కార్మికుల సమస్యలను నెరవేర్చాలని మైనారిటీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు సంబంధం లేకుండా సబ్సిడీ లోన్స్ ఇప్పించాలని, రాయికొట్టేకార్మికులు ఆధునీకరణ పరికరాలు (మిషన్లు) అ%శీ%దేవిధంగా కృషి చేయాలని ప్రజా పాలన లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాశ గూడ లను ప్రభుత్వమే దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి ప్రతి గ్రామానికి ఖబ్రస్తాన్ కు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని వినతి పత్రంలో కోరడం జరిగింది. అనంతరం ఎమ్మెల్సీ ఆమీర్ అలీ ఖాన్ సానుకూలంగా స్పందించి తుర్క కాశ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగిన పరిష్కారం చూపుతానని భరోసా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుర్కకాశ నల్గొండ జిల్లా అధ్యక్షులు ఎస్.కె అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను సకాలంలో నిర్మించుకోవాలి



**సూర్య ప్రతినిధి మర్రిగూడ** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకోవాలని విడుదలవారీగా బిల్లులు లబ్ధి పొందాలని మండలంలోని వట్టిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కార్యదర్శి సోమవారం స్థానికంగా అతను లబ్ధిదారులు ఇండ్లకు ముగ్గు పోసి నిబంధనలోపు ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు

## మొబైల్ షాప్ ప్రారంభించిన పల్లె



**సూర్య ప్రతినిధి మర్రిగూడ** మండల కేంద్రంలో స్థానిక బస్టాప్ జిల్లా అనుష అరవింద్ దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన మొబైల్ షాప్ ను కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొని హాజరై రిబ్బన్ కటింగ్ చేసి షాపుని ప్రారంభించారు షాప్ యజమాని వారిని శాలువాతో సత్కరించి ంచారు సన్మానించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత



**సంస్థాన్ నారాయణపుర్, ( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రానికి చెందిన ఉప్పల యాదగిరి కొద్దిరోజుల క్రితం మరణించగా నిరుపేద కుటుంబం కావడంతో బుధవారం ఆయన దశదిన కర్మ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకరన్న సహకారంతో గ్రామ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మృతుని కుటుంబానికి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం,నాయకులు పాశం కృష్ణ, ఉప్పల శ్రీనివాస్,గుండమల్ల సతీష్ కుమార్,శికిలమెట్ల ప్రభాకర్, ఉప్పల ఆంజనేయులు,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించిన కార్పొరేటర్ ఆలియా షౌకత్ అలీ



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** ఖమ్మం నగరం 38వ డివిజన్ బికే బజారు ఖిల్లా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠశాలలో జాయిన్ అయినా విద్యార్థులకు డివిజన్ కార్పొరేటర్ ఆలియా షౌకత్ అలీ బలపం పట్టి అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అక్షరాభ్యాసం చేసిన విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల ముందు నిరుపేదల పడికాపులు

**రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ షాప్ ల వద్ద నిరుపేదలు ఇబ్బందులు పడి కాపులు కా స్తున్నారు. మూడు నెలల రేషన్ బియ్యం కోసం ఉదయం 6 గంటల నుండి కాళీ బస్తాలు క్యూ లైన్ లో పెట్టి బియ్యం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. షాపులో బియ్యం ఉన్నప్పటికీ అధికారులు అనుమతి ఇవ్వకపోవ డంతో రేషన్ సరఫరా చేయడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులు స్పందించి తమకు రేషన్ బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు..

# నియోజకవర్గంలోని ప్రతి రోడ్డు 5.5 మీటర్ల వెడల్పు ఉండాల్సిందే

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పై రాజీ పడేది లేదు

రోడ్ల నిర్మాణ పనితీరు పై అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షలో.... కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, ( సూర్య ప్రతినిధి):** మునుగోడు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనుల పురోగతిపై మునుగోడు లోని అధికారిక క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ... సాగర్ రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు, ముష్టిపల్లి నుండి నాంపల్లి వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.. వీటితోపాటు అంగడిపేట నుండి లెంకలపల్లి వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రొసీజర్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు... నాంపల్లి నుండి ఇడికుడ వరకు, ఇడికుడ నుండి కమ్మగూడెం(తెరట్ పల్లి) వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చిన తర్వాత వాటి పనులకు సంబంధించి పురోగతి పై ఆరా తీశారు... వీటితోపాటు నియోజకవర్గంలో హెచ్ఎంఏ(హైబ్రిడ్ అన్నుటీ మోడల్) కింద ఎన్ని రోడ్లకు ప్రపోజల్స్ పంపించారనే విషయాలపై చర్చించారు...

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పిఆర్ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు... ప్రస్తుతం జరుగుతున్న 57 రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయి ఎప్పటి వరకు పూర్తవుతాయని ఆరా తీశారు... ఇవే కాకుండా మరో 34 పి ఆర్ రోడ్లు టెండరింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు... ప్రస్తుతం జరుగుతున్న 89 రోడ్డు పనుల ప్రోగ్రెస్ పై ఫోకస్ పెట్టి ప్రతిరోడ్డు 5.5 మీటర్లు వెడల్పు తో నాణ్యతతో నిర్మించాలన్నారు... నియోజకవర్గం లోని ప్రతి పిఆర్ రోడ్డు 3.75 మీటర్ల నుండి 5.5 మీటర్ల వెడల్పుకి మార్చాలని అధికారులను ఆదేశించారు... నియోజకవర్గంలో ఏ రోడ్డును చూసినా కూడా 5.5 మీటర్ల వెడల్పుతో ఉండాలని సూచించారు.. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు.. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం కోసం, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే బాధ్యత నాదని, నాణ్యత రోడ్ల నిర్మాణం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని కాంట్రాక్టర్లకు సూచించారు.. ఈ సమీక్ష సమావేశంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతోపాటు, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, ఆర్ అండ్ బి మునుగోడు డి ఈ శరత్ చంద్ర, పి ఆర్ ఎ ఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు....

## నీ దారులన్నీ మూసుకుపోయిన

**సంస్థాన్ నారాయణపుర్, ( సూర్య ప్రతినిధి):**

దారులన్నీ మూసుకపోయినప్పుడు
తెరిచి ఉన్నది ముళ్ళబాటైనా సరే
పల్లేర్లు మొలచిన సరే
కారు చీకటి కమ్ముకున్న సరే
ఆశలన్నీ అడియాసలైన సరే
నీ అడుగులు ఆపకు...
నీ ప్రయత్నం చెరపకు....
నలుదిక్కులను ఒక్కటి చేసి
సంకల్ప బలాన్ని
  కూడగట్టుకొని
నీ ప్రయాణం సాగనివ్వు
నీ గమ్యం చేరనివ్వు
ఏదో ఒక రోజున
నువ్వు అబ్బురపోయేలా
ప్రపంచాన్ని జయించినంతలా
మూసుకుపోయిన దారులన్నీ
పూలబాటై స్వాగతం పలుకుతుంది
శ్రమకు తగ్గ ఫలితముంటుంది
అన్వేషణకు ఆకారం ఏర్పడుతుంది
నీ ఆయుధం శ్రమ అయితే
గెలుపు నీ బానిస అవుతుంది
విజయ బావుట విజయకేతనం ఎగురుతుంది



బాలు కత్తుల

# డివిజన్ సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ తరపున కృషి







డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా బీఆర్ఎస్ పార్టీ పని చేస్తుందని డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే భవనం (ప్రగతిభవన్) లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రధాన సమస్యలపై ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రేటర్ కార్పొరేషన్ లోనే అతిపెద్ద డివిజన్ అయిన మైలార్ దేవ్ పల్లి (59) వ డివిజన్ లో ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యలు గాలికి వదిలి వారి స్వలాభ పనుల కోసం ప్రజల మౌలిక సదుపాయాలను కల్పించడం లేదని తెలిపారు. ప్రధానంగా గత ప్రభుత్వంలో అమలు జరిగి మధ్యంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాల్ని పూర్తిచేయడం కోసం, అనేక బస్తీలల్లో ప్రధాన రోడ్లకు అడ్డుగా ఉన్న ట్రాన్స్ఫార్మర్స్,విద్యుత్ స్తంభాలు అడ్డదిడ్డంగా ఉన్నవాటిని సరైన స్థలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయడానికి, అలాగే ప్రతీ బస్తీలల్లో చెత్త తొలగింపు పక్రియ,డ్రైనేజ్ వ్యవస్థను కూడా ఆధునీకరించి మూతలు లేని మనువల్స్ ను మరమ్మత్తులు త్వరగా చేపట్టే విధంగా, బస్తీలల్లో మురుగు ప్రవహించకుండా జీహెచ్ఎంసీ అధికారులను అలాగే వాటర్ అండ్ సివరేజ్ బోర్డుకు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ తో పాటు ఎడ్లపాడు సూర్యం, భాస్కర్ నేత, అశోక్ కుమార్, మల్లేష్, జి.రాజు, ప్రవీణ్, రాము, ఉప్పల్ శ్రీను, భగవాన్ దాస్, సునీల్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రైల్వే గేట్ సమస్యకు పరిష్కారం చూపాలి

### రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శివరాంపల్లి రైల్వే గేట్ రహదారి మూసివేతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గోడ నిర్మించడం వల్ల డివిజన్ లోని చాలా కాలనీల ప్రజలు ఈ సమస్య వల్ల పడుతున్న ఇబ్బందులు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని విన్నవించడంతో ఎంపీ తన కార్యాలయం నుంచి రైల్వే అధికారికి వినతిపత్రాన్ని తోకల శ్రీనివాస్ రెడ్డి రైల్వే నిలయంలో డీజీఎం ఉదయ్ నాథ్ కోట్లను మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సమస్యను వివరించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత 3 సంవత్సరాల క్రింద శివరాంపల్లి రైల్వే స్టేషన్ దగ్గర ఉన్నటువంటి రోడ్ మెయింటెనెన్స్ వర్క్ పేరు చెప్పి, క్లోజ్ చేశారని, ఇప్పటి వరకు ఓపెన్ చేయలేదు, రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారని, ఈ రోడ్ 40 సంవత్సరాలుగా డివిజన్లోని చాలా కాలనీవాసులు ఇది ముఖ్యమైన రహదారిగా వాడుతున్నారన్నారు. ఇది అరాంఘర్ రైల్వే అండర్ పాస్ కంటే ముందు నుంచి వాడుతున్న పురాతన రోడ్ వీధి బంధు చేయడం వల్ల చుట్టూ పక్కల ఉన్నటువంటి ప్రజలకు చాలా ఇబ్బందులు, స్కూల్, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులకు చాలా ఇబ్బందిగా ఉందని ముఖ్యంగా విద్యార్థుల అత్యవసర సేవలకు, రోజువారి రవాణాకు చాలా ముఖ్యమైందని తెలిపారు. గోడ నిర్మించడం కారణంగా మార్గం మూసి వేయబడటం వలన నివాసితులు దాదాపు 5 నుంచి 6 కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. దీనివల్ల నా ముఖ్యంగా 108 అంబులెన్స్, సేవలు, ఆసుపత్రులకు చేరుకోవడంలో గణనీయమైన అసౌకర్యం, జాప్యం ఏర్పడిందని వివరించారు. సానుకూలంగా స్పందించిన డీజీఎం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సాధిస్తానని, దీనికి సంబంధించిన కింది స్థాయి అధికారులతో పూర్తి సమాచారం తీసుకొని సమస్య తీరే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోదా పాండు యాదవ్, సీనియర్ నాయకులు సంతోష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, గోపాల్ నాయక్, పలు బస్తీలవాసులు తదితరులు పాల్గొన్నారు.

## గుగ్గిళ్ళ దివ్యమూర్తికి రాయగూడెంలో ఘనంగా సన్మానం



**ఖమ్మం (సూర్య ప్రతినిధి)** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపర మేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాయగూడెం గ్రామంలో గ్రామ పెద్దలు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. డాక్టర్ దివ్యమూర్తి తమ గ్రామానికి రావడం సంతోషకరమని గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని డాక్టర్ దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటి వరకు తనకు 114 చోట్ల సన్మానం జరిగిందని డాక్టర్ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబిసి జిల్లా ఉపాధ్యక్షులు బోయిన వేణు మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు మాజీ ఎంపీటీసీ పతానపు నాగయ్య సొసైటీ మాజీ డైరెక్టర్ తీగ రమణయ్య సూరేపల్లి జ్ఞాన రత్నం కట్టెకోల వెంకటేశ్వర్లు పతానపు కొండలు పందితి వీరయ్య కోసూరి రాజిబాబు రాచకొండ రాము కాలంగి చందర్రావు తీగ బ్రహ్మం కొండలు కాళంగి వీరబాబు యడపల్లి రాంబాబు ఆదాము లక్క గోపి లక్క నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా ప్రగతి కొనసాగించాలి





**-ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పటిష్ట చర్యలు**

**-ప్రజలకు మన సంతోషాన్ని పంచాలి వారిపై మన అసంతృప్తి ప్రదర్శించొద్దు**

**-బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహణ**

**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి సంక్షేమ అంశాలలో ఖమ్మం జిల్లా కొనసాగిస్తున్న విజయగాధను కొనసాగించాలని బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్రంలో నిర్వహించిన ఐఎఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ సంచాలకులుగా బదిలీపై వెళ్తున కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని జిల్లా అధికారుల బృందం నిర్వహించారు. కలెక్టరేట్ కు చేరుకున్న ముజమ్మిల్ ఖాన్ కు గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్సిసి కెడేట్స్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రగతిని ఉద్యోగులు గుర్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ గా ముజమ్మిల్ ఖాన్ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నారని స్నేహపూర్వక వాతావరణంలో అధికారులంతా మంచి బృందంగా ఏర్పడి ప్రజా సమస్యలు పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేసేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారని అధికారులు వెల్లడించారు.అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ పి. శ్రీనివాస్ రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిణి రెవెన్యూ డివిజన్ అధికారులు జిల్లా అధికారులు పలువురు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో తమకు ఉన్న అనుభవాలను తెలియజేశారు.

**అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి:**

ఈ సందర్భంగా బదిలీ పై పౌరసరఫరాల శాఖ సంచాలకులుగా వెళ్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ గా తన ప్రస్థానాన్ని ముజమ్మిల్ ఖాన్ వివరించారు.ఖమ్మం నేల చాలా పవిత్రమైందని ఇక్కడ పని చేయడంలో చాలా సంతృప్తి లభిస్తుందని వరదల సమయంలో ఇక్కడి అధికారులు సిబ్బంది అద్భుతంగా పని చేశారని అన్నారు. ప్రజలకు నేరుగా క్షేత్రస్థాయిలో ఇంటారాక్ట్ అవుతూ వారి సమస్యలు పరిష్కరించేందుకు తనకు అవకాశం లభించిన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు.హుస్నాబాద్ లో సబ్ కలెక్టర్ గా మొదటిసారి విధులకు చేరిన కొత్తలో ఒక ముసలావిడ తన దగ్గర వచ్చి దరఖాస్తు ఇచ్చి సమస్య పరిష్కారం చేయాలని కోరిందని తాను ఇటీవలే చేరానని తన పరిధిలో రాదని చెప్పినా కలెక్టర్ కాబట్టి పరిష్కరించాలని ఆ ముసలమ్మ అడిగినప్పుడు ప్రజలకు వ్యవస్థ పట్ల ఉన్న నమ్మకం మొదటిసారి గమనించానని అన్నారు.

కలెక్టరేట్ వ్యవస్థ 250 సంవత్సరాల నుండి ఉందని మనకు వ్యక్తిగతంగా ఎటువంటి గౌరవం, గుర్తింపు ఉండదని వ్యవస్థకు ఆ గౌరవం లభిస్తుందని అన్నారు. మనం ఉన్నా లేకపోయినా వ్యవస్థ ప్రజల కోసం పని చేయాలని వ్యక్తిగత కాంట్రిబ్యూషన్ ఒక్కటి రెండు శాతాలు మాత్రమే ఉంటాయని అన్నారు.మనం న్యాయం ప్రకారం విధులు నిర్వహిస్తే ప్రజల ముఖాలపై కనిపించే సంతోషం నుండి వచ్చే సంతృప్తి ఎక్కడా లభించిందని అన్నారు. శాంతి భద్రతలు సరిగా ఉంటేనే ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. వరదల సమయంలో కార్యాలయానికి పరిమితం కాకుండా పోలీస్ కమిషనర్ నేరుగా ప్రజలలో వెళ్లి పని చేశారని కలెక్టర్ తెలిపారు.

గత సంవత్సరం భారీ వరదల నేపథ్యంలో వరద సహాయక చర్యలు సాధారణ పరిస్థితులను పునరావృతం చేయడం వంటి అంశాలలో ఉద్యోగులు సఫలీ కృతులయ్యారని ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను విజయవంతంగా సకాలంలో పూర్తి చేయడం కారణంగా వరదల విపత్తుల నుంచి బయటపడ్డామని భవిష్యత్తులో వరదలు వస్తే ఎలా ఎదుర్కోవాలో పక్కా ప్రణాళిక తయారు చేసుకున్నామని అన్నారు. మహిళలు అన్ని ప్రాంతాలు మతాలు కులాల వారిగా గత కొన్ని దశాబ్దాలుగా వివక్షకు గురయ్యారని దానిని నివారించేందుకు మహిళలను బలోపేతం చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. 50 శాతం జనాభాను విస్మరిస్తే అభివృద్ధి సాధ్యం కాదని, తన సొంత కుటుంబంలో కూడా మూడవా తరం అద్భుత స్థితిలో ఉందంటే కారణం ఒక మహిళ చదువుకోవడం మాత్రమేనని అన్నారు.

దేశం చాలా మారిందని అధికారులకు ప్రజా ప్రతినిధులకు బాధ్యత పారదర్శకత పెరిగిందని ప్రజలు నిరంతరం గమనిస్తూ మన పని తీరు పర్యవేక్షిస్తున్నారని అన్నారు.మనం ఆశించే మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు.బాల సదనంలో పిల్లలను మన పిల్లలుగా భావించాలని అన్నారు. అసమానతలను తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. నవ సమాజ నిర్మాణానికి పునాది సంక్షేమ శాఖ ద్వారా వేసే అవకాశం ఉంటుందని, బాల సదనం, అంగన్ వాడి కేంద్రాలకు చేసే పని చాలా సంతృప్తి కలిగించిందని అన్నారు. మహిళా మార్ట్ స్త్రీ టీ స్టాల్ షీ రాక్స్ సెంటర్ ఏర్పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ వరద సహాయక చర్యలు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన ఇలాంటి అనేక కార్యక్రమాలు విజయ వంతంగా ఖమ్మం జిల్లాలో అమలవు తున్నాయి అంటే దానికి కారణం ఇక్కడ చిత్తశుద్ధితో పనిచేసే అధికారులు, సిబ్బంది ఉండటమేనని అన్నారు.

ఉద్యోగులు ప్రభుత్వ విధులను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రతి రోజూ కొంత సమయం నడవాలని అన్నారు.ప్రతి ఉద్యోగి ప్రభుత్వ విధులతో పాటు తన కుటుంబానికి సమయం కేటాయించాలని అన్నారు.మనకు ఒక పని ఉంటే అధికారులు ఏ విధంగా స్పందించాలని కోరుకుంటామో అదేవిధంగా మన కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మనం ప్రవర్తించాలని ఈ అంశాన్ని ఉద్యోగులంతా గుర్తుంచుకోవాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ స్థాయిలో సేవలు అందించిన ఖమ్మం జిల్లా తనకు ఎప్పుడు ప్రత్యేకంగా నిలుస్తుందని 12 నెలల కాలంలో తనకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం అభివృద్ధి చెందేందుకు జిల్లా యంత్రాంగం ఉత్సాహంగా పని చేసేందుకు అధికారులను ఎప్పటికప్పుడు మోటివేట్ చేసేందుకు పదవి విరమణ పొందుతున్న సిబ్బందిను సన్మానిస్తూ ప్రస్థానం కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. %ూ%క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులు సిబ్బంది ప్రజలతో కలెక్టర్ ఇంటారాక్ట్ అవుతూ వారికి ఏ అవసరాలు ఉన్నాయి, ప్రభుత్వం పరిధిలో వాటిని ఎలా నేరవేర్చాలి అనే కోణంలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించారని అన్నారు.స్నేహపూర్వక వాతావరణంలో సజావుగా గత 11 నెలల సమయం గడిచిందని, మహిళల అభ్యున్నతి, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యా శాఖపై కలెక్టర్ తనదైన ముద్ర వేశారని అన్నారు.అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమయంలో జరిగిన కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన ఏవీ ను ప్రదర్శించారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు వివిధ సంఘాల ప్రతినిధులు ఉన్నతాధికారులు జిల్లా అధికారులు తహసిల్దార్ లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ జెడ్పి సిఇఓ దీక్షా రైనా రెవెన్యూ డివిజన్ అధికారులు నర్సింహారావు రాజేందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి జిల్లా అధికారులు తహసిల్దార్ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత సామాజిక వర్గంలో అసంతృప్తులు




**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీద ఆ సామాజికవర్గం అలకబూనిందా? ఎప్పుడూ పైచేయిగా ఉండే?. మమ్మల్ని ఇప్పుడు పట్టించుకోవడం లేదంటూ నారాజ్ అవుతున్నారా? ఇటీవల జరిగిన పరిణామాలను ఆ కుల పెద్దలు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారా?అధికార పార్టీ మీద కోపంగా ఉన్న ఆ సామాజికవర్గం ఏది ఎక్కడ తేడా కొట్టింది? తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అంటేనే. రెడ్ల పార్టీ అని ఓ ముద్ర ఉంది. రాజకీయ వర్గాల్లో కూడా ఇదే విస్తృతాభిప్రాయం. లెక్కల ప్రకారం చూసుకున్నా కూడా ఆ సామాజిక వర్గం ఓటు బ్యాంక్ ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకే అండగా ఉంటుంది. అలాగే. పార్టీలో కూడా రెడ్డి నాయకులదే పైచేయిగా నడుస్తూ ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అయినా విభజన తర్వాత తెలంగాణలో అయినా ఇది అనాదిగా వస్తున్నదే. తెలంగాణలో కూడా ఇప్పటిదాకా జరిగిన అన్ని పరిణామాల్లో రెడ్డి నేతలదే పైచేయి అయిందిగానీ ఇటీవల జరుగుతున్న పరిణామాలతో ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యత తగ్గుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయట. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసిన తర్వాత సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా ఇవ్వాలని డిసైడ్ అయినట్టు చెప్పుకుంటున్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో కూడా మాల, మాదిగ, బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేసింది ప్రభుత్వం. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఏ పదవుల భర్తీ అయినా అందులో కచ్చితంగా రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఉండేది. కానీ తాజాగా జరిగిన మంత్రివర్గ విస్తరణలో రెడ్లకు చోటు లేకుండా పోయింది. దీంతో ఆ సామాజికవర్గం అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. పైగా ఆశావహుల్లో రెడ్డి నాయకులే ఎక్కువగా ఉండటంతో అసంతృప్త స్థాయి కూడా ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇది రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో మరో కొత్త వాదన వినిపిస్తోంది పార్టీ వర్గాల్లో. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత జరిగే విస్తరణలో రెడ్లకు ప్రాధాన్యత దక్కే అవకాశం ఉందని అంటున్నారు.ఇటీవల కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీ కూడా జరిగింది. ఉపాధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవుల భర్తీలో కూడా జనాభఆ ప్రాతిపదికన తీసుకున్నారు. ఇందులో 68 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించారు. అంతవరకు బాగానే ఉందిగానీ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు కొందరు పార్టీ నాయకులు. సామాజిక న్యాయం చేయాలన్న ఆలోచన మంచిదే గానీ పార్టీకి వెన్నెముకగా ఉన్న సామాజిక వర్గాలను దూరం చేసుకోవడం కూడా మంచిది కాదంటూ సలహాలిస్తున్నారట. అటు సోషల్ జస్టిస్ పేరుతో కనీసం ప్రభుత్వం కానీ? పార్టీ నాయకత్వం గానీ జనంలోకి వెళ్లి చర్చించే ప్రయత్నం చేయడం లేదు. తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం పనులు చేసుకుంటూ పోతోందిగానీ ఆ విషయాన్ని ఆయా వర్గాలకు చేర్చాల్సిన పార్టీ మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదు. దీంతో కొత్తగా అమలు చేస్తున్న సామాజిక న్యాయం కారణంగా ఏయే వర్గాలు ఎంత బెనిఫిట్ అవుతాయన్న వివరాలు కనీసం ఆ కులాలకు కూడా చేరడం లేదు. ఇలాంటి వాటిని పూర్తిస్థాయిలో చెప్పుకోగలిగినప్పుడే ఇటు పార్టీకి, అటు ప్రభుత్వానికి ఉపయోగం అన్నది నేతల అభిప్రాయం. కానీ అంతా అలా మాట్లాడుకునే వాళ్ళేగానీ క్షేత్ర స్థాయిలో చెప్పే ప్రయత్నం మాత్రం ఎవ్వరూ చేయడం లేదన్న అసంతృప్తి పెరుగుతోంది. పార్టీకి వెన్నంటి ఉన్న సామాజిక వర్గాలకు దగ్గరవడం ఒక ఎత్తయితే మారుతున్న పరిస్థితుల్లో అనుసరించే వ్యూహాలను జనంలోకి విస్తృతంగా తీసుకుపోవడం మరో ఎత్తు. కానీ? ఆ పని మాత్రం జరగడం లేదని చెప్పుకుంటున్నారు. పార్టీ నాయకత్వం ఆ దిశగా ఆలోచిస్తేనే ఉపయోగం అన్న అభిప్రాయం బలపడుతోంది. సామాజిక న్యాయం పరంగా మెజార్టీ జనాభాకు మెజార్టీ పదవులన్న సూత్రాన్ని పాటిస్తూ పార్టీకి వెన్నుదన్నుగా ఉండే కులాలను సంతృప్తి పరచడం కత్తిమీద సామే అయినా చాలా జాగ్రత్తగా చెయ్యక తప్పదని అంటున్నారు పరిశీలకులు. దీంతో ప్రస్తుతం నారాజ్‌గా ఉన్న రెడ్లను కాంగ్రెస్ అధిష్టానం ఎలా సంతృప్తి పరుస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## పర్యావరణ సంరక్షణలో మొక్కల పెంపకం కీలకం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** పర్యావరణ సంరక్షణలో మొక్కల పెంపకం కీలకం కానుందని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ అన్నారు. భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తల్లి వందనం కార్యక్రమంలో భాగంగా ఉప్పర్ పల్లి గవర్నమెంట్ స్కూల్, పోచమ్మ దేవాలయం, బిజెపి పార్టీ కార్యాలయం దగ్గర మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.శ్రీధర్ మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ చేపట్టిన తల్లి వందనం కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త విజయవంతం చేయాలన్నారు. మన పర్యావరణ సంరక్షణలో మొక్కలను పెంచాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొక్క బాల్రెడ్డి ,సత్యనారాయణ ముదిరాజ్, సోల్కర్ రెడ్డి, వనిత రెడ్డి, కీర్తి శ్రీను, శ్రీకాంత్ రెడ్డి, బండారి బాలకృష్ణ, మల్లేష్ చారి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, అశోక్ రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మావతి, స్వప్నరెడ్డి, యాదయ్య, విజయ యాదవ్, తుంగ ఇంద్ర రెడ్డి, రాజశేఖర్రెడ్డి, పవన్, లడ్డూ, కర్ణాకర్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ రాజకీయంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

**షాద్ నగర్ :** రాష్ట్రాన్ని కుదిపేస్తున్న ఫోన్ టైపింగ్ వ్యవహారం షాద్ నగర్ పట్టణం రాజకీయానికి తగిలింది. బీజేపీ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుండి టికెట్ ఆశించి, టికెట్ రాకపోవడంతో ఫార్వార్డ్ బ్లాక్ నుండి ఎన్నికల బరిలో దిగారు. ఎన్నికల అనంతరం తిరిగి బీజేపీ గూటికి చేరారు.విష్ణువర్ధన్ రెడ్డి విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ... ఈనెల 14వ తేదీన తనకు జూబ్లీహిల్స్ పోలీసుల నుండి నోటీసు అందిందని, పోలీసు విచారణ జాబితాలో తన ఫోన్ నెంబర్ ఉందని, దీనిపై విచారించాలని పిలుపురాగా ఆ నోటీసు అందుకొని విచారణకు హాజరైనట్లు తెలిపారు. నవంబర్ 15 నుండి 30వ తేదీ వరకు సంబంధించిన మీ ఫోన్ డేటా వివరాలు తమ వద్ద ఉన్నాయని, అంతకు ముందు ఉన్న డేటా లేదని పోలీసులు విచారణలో చెప్పినట్లు తెలిపారు. తన నెంబర్ 9618567566 నెంబర్ ట్యాపింగ్ జరిగిందని పోలీసులు ధ్రువకరించినట్లు విష్ణువర్ధన్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఆ మధ్య కాలంలోనే తనపై 8 ఎన్నికల కేసులు ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు కూడా విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంలో తన ఫోన్ ను చట్ట విరుద్ధంగా ట్యాపింగ్ చేసిన వారు ఎవరైనా సరే, ఎంత పెద్దలైనా సరే, ఏ పార్టీ వారు అయినా సరే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన గోప్యతను భంగపరిచే హక్కు ఎవరికీ లేదన్నారు. ముఖ్యంగా తన ఫోన్ ట్యాపింగ్ జరిగాక తాను ఎవరెవరితో ఏం మాట్లాడానో, ఎన్నికల్లో జర్నలిస్టులు, ముఖ్య నేతలు, అధికారులు, తన బంధువులు, పార్టీ కార్యకర్తలు, తన భార్యాపిల్లలు ఎవరెవరితో సంభాషించానో వీటన్నింటినీ దొంగచాటుగా విని తన ప్రాథమిక హక్కును హరించారని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## మాజీ ఎంపిటీసీ ఆత్మహత్యాయత్నం

రాజన్న సిరిసిల్ల : తంగళ్ళపల్లి మండలం అంకుశాపూర్ మాజీ ఎం.పి.టి.సి.కుంటయ్య ఆత్మహత్యాయత్నం చేసాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తన భూమిని కబ్జాచేసి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించాడు. వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి వాట్సాప్ స్టేటస్ లో పెట్టి కుంటయ్యపురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో లొకేషన్ ట్రేస్ చేసి అపస్మారక స్థితిలో ఉన్న కుంటయ్యను పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమం గా వుండడంతో ప్రైవేట్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ ను కోరుతు సూసైడ్ నోట్ నాసాడు. కుంటయ్యకు భార్య విజయ ఇద్దరు కూతుర్లు భార్గవి, దీక్షిత ఉన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహన కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలని పలు బీసీ, కుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచేందుకు 18న నగరంలోని ధర్నా చౌక్ మహా దీక్ష చేపట్టనున్నట్లు తెలిపాయి. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థలు జరపకుంటే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామన్నాయి. బషీర్ బాగ్ లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు డి. సురేశ్, కె. జనార్దన్ గౌడ్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

## కొండాపూర్ మల్టీ లెవల్ ఫ్లై ఓవర్‌ను పరిశీలించిన జీహెచ్ఎంసి కమిషనర్

**హైదరాబాద్ :** గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి టూ కొండాపూర్ మల్టీ లెవల్ ఫ్లైఓవర్ త్వరలో అందుబాటులోకి రానుంది. ఆ పనులను జీహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ మంగళవారం పరిశీలించారు. త్వరలో ఈ ఫ్లైఓవర్ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. జీహెచ్ంఎసి 178 కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్ నిర్మాణం చేసింది. 1.2 కిలోమీటర్ల పొడవు. 24 మీటర్ల వెడల్పు.ఆరు లేన్ల తో ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే గచ్చిబౌలి ప్రాంతం లో ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన థర్డ్ లెవెల్ ఫ్లైఓవర్ ఇది. ఓఆర్ఆర్ నుండి కొండాపూర్, హఫీజ్ పేట్ మార్గాల్లో వెళ్లే వాహనాలకు రాకపోకలు ఈజీ కానున్నాయి. ఫ్లైఓవర్ ద్వారా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కు కనెక్టివిటీ మెరుగయింది. కొండాపూర్ నుంచి ఎయిర్ పోర్ట్ కు వెళ్ళే వారికి గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ చిక్కులు లేకుండా ఫ్లైఓవర్ పై నుంచి జర్నీ సులభం కానుంది..


## ట్రాక్టర్‌పై విన్యాసాలు.. హడలెత్తిన వాహనదారులు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

**గద్వాల :** ట్రాక్టర్ పై ఓ యువకుడు సినిమా స్టైల్ లో స్టంట్ చేసాడు. దాంతో రహదారిపై వెళ్తున్న వాహనదారులు హడలిపోయారు. జాతీయ రహదారి 44 పై విన్యాసాలు చేస్తూ అందరిని హడలెత్తించి భయభ్రాంతులకు గురి చేశాడు.జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు నుండి ఉండవల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై యువకుడు ట్రాక్టర్ పై సాఫీగా పడుకొని డ్రైవింగ్ చేసుకుంటూ పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు.జాతీయ రహదారిపై వందల వాహనాలు హై స్పీడ్ తో పరుగులు పెడుతూ ఉంటాయి.. ఈ క్రమంలో ఈ యువకుడు ట్రాక్టర్ పై

# ఆకట్టుకుంటున్న ‘భూ అంటూ భూతం’



నితిన్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘తమ్ముడు’. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న “తమ్ముడు” సినిమా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ‘భూ అంటూ భూతం..’ రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. ‘భూ అంటూ భూతం..’ పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. ‘భూ అంటూ భూతం..’ పాట ఎలా ఉందో చూస్తే – ‘భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి. భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి..పుట్టగానే నేరుగా నువు పరుగెత్తలే, పట్టుకుంటూ పడుతూ నడకేనేర్చావే, భయపడి అడుగు ఆపకే..అంటూ సాగుతుందీ పాట.



# ప్యారడైజ్ లక్ష్యానికి అనుకోని బ్రేకులు

న్యాచురల్ స్టార్ నాని కెరీర్ లోనే అతి పెద్ద ప్యాన్ ఇండియా మూవీగా రూపొందుతున్న ది ప్యారడైజ్ ముందు లాక్ చేసుకున్న విడుదల తేదీ మార్చ్ 26. ఒక రోజు గ్యాప్ తో రామ్ చరణ్ పెద్ది వస్తున్నా సరే వెనక్కు తగ్గకూడదని తొలుత నిర్ణయించుకున్నారు. కానీ తాజా పరిణామాలు ప్యారడైజ్ కు బ్రేక్స్ లా మారుతున్నాయని ఇన్ సైడ్ టాక్. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ జరిగినప్పటికీ ఇంకొందరు కీలక ఆర్టిస్టుల డేట్లు అందుబాటులో లేకపోవడంతో పాటు సెట్ వర్క్ మరింత మెరుగు పరచాలనే ఉద్దేశంతో చిన్నవిరామం ఇచ్చారని, తిరిగి జూలై లేదా ఆగస్ట్ లో పునఃప్రారంభమవుతుందని అంతర్గత సమాచారం.ఒకవేళ ఇది నిజమైతే ప్యారడైజ్ మార్చ్ లో రావడం కష్టం. వేసవికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల వేగంగా తీయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పరిస్థితులు దానికి సహకరించడం లేదని వినికిడి. నాని కూడా ఎలాంటి కమిట్ మెంట్స్ లేకుండా పూర్తిగా దీనికే అంకితమవుతున్నాడు. బయట ప్రచారం జరుగుతున్నట్టు ఇంకా ఓటిటి డీల్ కాలేదని తెలిసింది. నెట్ ఫ్లిక్స్ రెడీగా ఉన్నా రేట్ విషయంలో కంక్లూజన్ కు రాలేదని అంటున్నారు. చాలా ముఖ్యమైన పాత్రకు మోహన్ బాబుని తీసుకున్నారనే వార్త కూడా అధికారిక ధృవీకరణ దక్కించుకోలేదు. నెలల తరబడి ఇది గాసిప్ గానే ఫిలిం నగర్ వర్గాల్లో తిరుగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే భారీ పొటెన్షియల్ ఉన్న పెద్ది, ది ప్యారడైజ్ లు క్లాష్ లేకుండా సోలోగా రావడమే మంచిది. ఒకపక్క పెద్దిని దర్శకుడు బుచ్చిబాబు పరుగులు పెట్టిస్తున్నారు. ఇంకా చాలా టైం ఉన్నప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్లకు ఎక్కువ సమయం దొరికేలా చూసుకుంటున్నారు. హైప్ పరంగా చూస్తే దీని మీద విపరీతమైన బజ్ వచ్చేసింది.



# ఈ సినిమాకు వెబ్ సిరీస్ ఎందుకు?

ఎంత పెద్ద బడ్జెట్ తో తీసినా ఎంత క్రేజీ క్యాస్టింగ్ ఉన్నా కంటెంట్ బాలేకపోతే ప్రేక్షకులు నిర్మొహమాటంగా మొదటి షోకే తిరస్కరించే రోజులివి. తెరవెనుక 24 క్రాఫ్ట్స్ ఎంత కష్టపడ్డారనేది ఆడియన్స్ కి అనవసరం. తన టికెట్ డబ్బుకు, సమయానికి న్యాయం చేశారా లేదా అనేది మాత్రమే చూసుకుంటాడు. ఉద్దేశపూర్వకంగా ఏదైనా సినిమాని చంపడం సోషల్ మీడియా జమానాలో అయ్యే పని కాదు. కానీ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాత్రం ఈ వాస్తవాన్ని అంగీకరించేందుకు ఇష్టపడటం లేదు. సూర్యతో తీసిన రెట్రో మంచి చిత్రమని, థియేటర్లకు వెళ్ళినప్పుడు ఆడియన్స్ తనకు చెప్పారని మళ్ళీ అదే క్యాసెట్ వినిపిస్తున్నారు.రెట్రోని 40 నుంచి 50 నిమిషాల వరకు ఒక్కో ఎపిసోడ్ కి నిడివి పెట్టి వెబ్ సిరీస్ లా రిలీజ్ చేసే ఆలోచన ఉందని, కానీ నెట్ ఫ్లిక్స్ నుంచి అంత సానుకూల స్పందన రాలేదని చెప్పుకొచ్చారు. కొందరు ఉద్దేశపూర్వకంగా డబ్బులు ఖర్చు పెట్టి సినిమాలను నెగటివ్ చేస్తున్నారని, అలాంటి వాళ్లకు రెట్రో బలైపోయిందని అన్నారు. అసలు ఎవరి ప్రభావం లేని సామాన్య ప్రేక్షకులు, అభిమానులకు సైతం రెట్రో నచ్చలేదు. కలెక్షన్లలోనూ అది బయట పడింది. నిజంగా కథలో దమ్ముంటే ఎవరూ ఎవరిని ఆపలేరని చాలా సినిమాలు ఋజువు చేశాయి. కానీ కార్తీక్ సుబ్బరాజ్ ఇవన్నీ ఒప్పుకోవడానికి ససేమిరా అంటున్నారు. ఇప్పుడు చేసిన పొరపాట్లు ఏవో గుర్తిస్తే భవిష్యత్తు అవి రిపీట్ కాకుండా చూసుకోవచ్చు. అలా కాకుండా నేనో క్లాసిక్ తీశాను, కావాలని చంపేశారు అంటే ఎవరూ సానుభూతి చూపరు. కంగువ టైంలోనూ సూర్య భార్య జ్యోతిక ఇదే తరహాలో బాగున్న సినిమాని కిల్ చేశారని, ఎంత కష్టపడి తీశారో మీకు తెలుసా అంటూ సీరియస్ గానే నిలదీశారు.

# బాహుబలిలో తమన్నాకి డూప్‌గా బిగ్ బాస్ భామ.. వద్దన్నా కూడా!

ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన క్రేజీ ప్రాజెక్ట్ బాహుబలి ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రభాస్, రానా, తమన్నా, అనుష్క, నాజర్ ప్రధాన పాత్రలలో ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రం తెలుగు సినిమా ఖ్యాతిని పెంచింది. అనేక రికార్డులు తిరగరాసింది. రెండు పార్ట్‌లుగా రూపొందిన ఈ చిత్రం హాలీవుడ్ ప్రముఖులని సైతం ఆశ్చర్యపరిచింది. అయితే ఈ చిత్రంలో తమన్నాకి డూప్‌గా బిగ్ బాస్ భామ భాను శ్రీ నటించిందట. ఈ విషయాన్ని తాజా ఇంటర్వ్యూలో తెలియజేసింది భాను. బాహుబలి సినిమాలో తమన్నా ఫ్రెండ్స్ లో ఒక క్యారెక్టర్ చేసిన భాను శ్రీ తమన్నా డూప్‌గా కూడా చేసినట్టు పేర్కొంది. నేను డ్యాన్సర్ గా చేస్తున్నప్పుడు తమన్నాకు డూప్ గా చేయమని ఆఫర్ ఇచ్చారు. అయితే అది బాహుబలి సినిమా అని నాకు తెలీదు. మొదట చేయను అని చెప్పాను. ఆ తర్వాత వాళ్ళు రెమ్యునరేషన్ బాగా పెంచడంతో ఓకే చెప్పాను. సెట్ కి వెళ్ళాక అది బాహుబలి సినిమా అని తెలిసింది. 17 రోజులు తమన్నాకు డూప్ గా నటించాను. ఆ తర్వాత నా యాటిట్యూడ్, యాక్టింగ్ చూసి తమన్నా ఫ్రెండ్ క్యారెక్టర్ కి తీసుకున్నారని పేర్కొంది భాను శ్రీ. ఈ అమ్మడు బిగ్ బాస్ తర్వాత ఢీ షోలో మెంటర్ గా చేసింది కానీ కొన్ని ఎపిసోడ్స్ తర్వాత మధ్యలోనే వెళ్ళిపోయింది.అందుకు గల కారణం కూడా తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. బిగ్ బాస్ తర్వాత ఢీ ఆఫర్ వస్తే బిగ్ బాస్ టీమ్ కి చెప్పే ఆ షో చేశాను. కానీ అయిదు ఎపిసోడ్స్ పూర్తి అయిన తర్వాత నాకు ఫోన్ చేసి మీరు ఆ షో చేయొద్దు అన్నారు. నేను మీకు చెప్పినప్పుడు ఒకే అన్నారు కదా, అందుకే చేస్తున్నాను అని చెప్పాను. అయితే మా రీజన్స్ మాకు ఉన్నాయి. అగ్రిమెంట్ లో మీరు వేరే ఛానల్ షోలు చేయొద్దు అని ఉంది కదా అన్నారు. దాంతో మధ్యలో వెళ్ళిపోయా. నేను డ్యాన్సర్ గా కెరీర్ మొదలుపెట్టి ఢీలో ఒక డ్యాన్స్ టీమ్ కి మెంబర్ అంటే చాలా సంతోషంగా ఫీల్ అయ్యాను. కాని మధ్యలోనే వెళ్లిపోవాల్సి రావడం చాలా బాధ కలిగించిందని భాను శ్రీ ఇంటర్వ్యూలో పేర్కొంది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.